హలో లోకేశ్... సక్సెస్

'ల్యాండ్, శాండ్, మైన్స్... ఏదీ వదిలిపెట్టడు ఈ పాపాల పెద్దిరెడ్డి. నేను జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు ఎక్కడికి వెళ్లినా ఒకే రకమైన టిప్పర్, ఒకే రకమైన జేసీబీ. దానిపై పీఎల్ఆర్.పాపాల పెద్దిరెడ్డి సామ్రాజ్యం ఏస్థాయికి వెళ్లిందో చూడండి. చిత్తూరు జిల్లాను క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్న ఈ కుటుంబానికి ఓటు ద్వారా రేడియేషన్ ఇవ్వండి.'

'చంద్రబాబు హయాంలో పెట్టుబడుల్లో, గ్రామీణ ఉపాధిలో, మహిళల భద్రతలో, సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్రం నెంబరు వన్. జగన్ హయాంలో గంజాయి, డ్రగ్స్‌తో పాటు బూమ్‌బూమ్, ఆంధ్ర గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి ప్రమాదకరమైన మద్యానికి, కోడికత్తికి, గులకరాయికి, పరిశ్రమలను పక్క రాష్ట్రాలకు తరిమేయడంలో, పెట్రోల్, డీజల్, గ్యాస్, కరెంట్ ధరలు పెంచడంలో నెంబరు వన్'

'సీసీసీ అంటే ఏంటో తెలుసా? చంద్రగిరి, చెవిరెడ్డి, చెవిలో పువ్వు. ఐదేళ్లలో 2 వేల కోట్లు సంపాదించాడు చెవిరెడ్డి. ఆయన పనైపోయింది కాబట్టే పక్క జిల్లాకు వెళ్లిపోయాడు. ఇప్పుడు జూనియర్ వచ్చి చెవిలోపువ్వు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. రెండుసార్లు ఈ కుటుంబానికి అవకాశమిచ్చారు. మీ జీవితాలు మారాయా? ఒక్క పరిశ్రమైనా, ఉద్యోగమైనా వచ్చిందా?'



చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించమని అభ్యర్థిస్తున్న లోకేశ్



'గతంలో కోడికత్తిలాగే ఈసారి గులకరాయి డ్రామా ఆడారు. కోడికత్తి డ్రామా తర్వాత బాబాయ్ శవమయ్యారు. ఇప్పుడు మళ్లీ తాడేపల్లి నుంచి ఏ శవం బయటికి వస్తుందోనని కుటుంబసభ్యులు భయపడుతున్నారు. సొంత తల్లి, చెల్లే జగన్‌ను చూసి భయపడుతున్నారంటే ఇక రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఏంటో'

'మై డియర్ జగన్ టైం, డేట్ నువ్వు ఫిక్స్ చేయ్. నేను చంద్రబాబును తీసుకొస్తా. ఇక్కడే తిరుమల ఉంది. నువ్వు ముందు మెట్లు ఎక్కుతావా, లేదా చంద్రబాబు ముందు ఎక్కుతారో చూద్దాం. అప్పుడు ముసిలోడు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు'

హలో లోకేశ్ కార్యక్రమం యువతలో ఉత్సాహాన్ని నింపింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చంద్రగిరి సమీపంలోని ఐతేపల్లి వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాలనుంచీ వేలాదిమంది యువతీ యువకులు తరలిరావడంతో సభా ప్రాంగణం కళకళలాడింది. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పార్టీ పతాకాలతో తొండవాడనుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచానికే ఒక విజనరీ నాయకుడైన చంద్రబాబు నాయుడు జన్మించిన నేల ఈ చంద్రగిరి అంటూ ప్రసంగాన్ని మొదలుపెట్టిన లోకేశ్ ప్రసంగంలో రాజకీయ చెణకులు యువతచేత చప్పట్లు కొట్టించాయి. తరువాత పలువురు యువతీయువకులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానాలిచ్చి ఆకట్టుకున్నారు. అంతకుముందు బీజీఎస్ కల్యాణమండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అభ్యర్థులతో లోకేశ్ సమీక్షించారు. తాజా రాజకీయ పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఎన్ఆర్ఐలతో సమావేశమై ఫొటోలు దిగారు. అనంతరం పలువురు వైసీపీ నాయకులు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు.

- చంద్రగిరి





సూళ్లూరుపేట స్టేట్‌బ్యాంకులో పడిగాపులు కాస్తున్న వృద్ధులు

సగంమందికీ అందని పెన్షన్లు

బ్యాంకు ఖాతాల్లో జమ కాని నగదు

సచివాలయాలు, బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగుల పడిగాపులు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): సా[illegible] ...తా పెన్షన్లు జిల్లాలో సగంమందికి కూడా అందలేదు. జిల్లాలోని 2,70,390మంది పెన్షనర్లకు నెలవారీ రూ. 80.48 కోట్లు పంపిణీ కావాల్సి వుంది. ఏప్రిల్ నెలకు సంబంధించిన ఈ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్టు ప్రకటించింది. ఇందులో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఆధార్ కార్డు బ్యాంకు ఖాతాలకు లింకైన 2,00,868మందికి నేరుగా వారి ఖాతాలకు నగదు జమ చేసినట్టు ప్రకటించింది. మిగిలిన 69,522 మందికి రూ. 20.21 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామని ప్రకటించింది. బుధవారం 53,206 మందికి, గురువారం 64506 మందికి మొత్తం రూ. 18.79 కోట్లు పంపిణీ చేసినట్టు జిల్లా యంత్రాంగం ప్రకటన జారీ చేసింది. బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ చేసినట్టు అధికారులు ప్రకటించడంతో ఖాతాలు కలిగిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎండన పడి బ్యాంకులకు పరుగులు తీశారు. అయితే కొద్దిమందికి మాత్రమే నగదు ఖాతాల్లో జమైంది. ఎక్కువ శాతం మందికి జమ కాలేదని సిబ్బంది చెప్పడంతో ఇళ్లకు పోయి మళ్లీ రావడం ఎందుకని మధ్యాహ్నం వరకూ బ్యాంకుల వద్దే పడిగాపులు కాయడం కనిపించింది. ఖాతాల్లో జమ కాలేదని తెలిసి కొందరు, ఇళ్ల వద్దకు వచ్చి ఇస్తారని తెలియక కొందరు ఇలా పలువురు సచివాలయాలకు కూడా వెళ్లి వాకబు చేయడం కనిపించింది. సచివాలయాల్లో సిబ్బంది తమ దగ్గరున్న లిస్టులు పరిశీలించి కొందరిని తిరిగి బ్యాంకులకు పంపుతుండగా మరికొందరిని ఇళ్లకు వెళ్లండి తామే వచ్చి ఇస్తామని చెప్పి పంపుతున్నారు.

బ్యాంకుల్లో సవాలక్ష సమస్యలు

బ్యాంకుల్లో నగదు కాని వారి సమస్య ఒకలా వుండగా నగదు జమైన వారి సమస్యలు రెండింతలు కనిపిస్తున్నాయి. పలువురు లబ్ధిదారుల ఖాతాలు యాక్టివ్‌గా లేవు. నెలల తరబడీ లావాదేవీలు జరపక పోవడంతో చాలావరకూ ఫ్రీజ్ అయ్యాయి. వాటిని తిరిగి యాక్టివ్ చేసి ఆపరేట్ చేయడానికి బ్యాంక్ పాస్ బుక్,ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులు ఇవ్వాల్సి వస్తోంది.ఆ పనిపై ఒకటికి రెండు సార్లు బ్యాంకులకు తిరగాల్సి వస్తోంది. మరోవైపు ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేనివారికి ఆ వ్యవధికి తగ్గట్టు నెలకు రూ. 15 చొప్పున పెన్షన్ నగదులో ఆటోమేటిగ్గా కట్ అయిపోతోంది.

పెరుమాళ్ళపల్లి వృద్ధురాలికి హోసూరులో పెన్షన్ జమ



తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీలోని లక్ష్మిచెరువు గ్రామానికి చెందిన ఈమె పేరు లక్ష్మి. చెర్లోపల్లిలోని కెనరా బ్యాంకులో పెన్షన్ డబ్బులు తీసుకుందామని వెళ్లి వాకబు చేస్తే ఇంకా జమ కాలేదని చెప్పారు. దాంతో పడుతూ లేస్తూ సచివాలయం దారి పట్టింది. అక్కడ విచారిస్తే పెన్షన్ తమిళనాడు రాష్ట్రం హోసూరులోని తమిళనాడు గ్రామీణ బ్యాంకు ఖాతాలో జమైందని చెప్పడంతో ఆమె ఖంగుతింది. తాను గతంలో హోసూరులో నివాసం వున్నామని, అయితే అక్కడ తనకు బ్యాంకు అకౌంట్ వుందన్న సంగతి కూడా తెలియదని, ఇపుడు పెన్షన్ డబ్బు కోసం అంత దూరం వెళ్లి రావాలా అంటూ వాపోయింది.

ఎప్పుడు పడితే అప్పుడొచ్చి తీసుకోమంటున్నారు!



తూకివాకం పంచాయతీ ఎర్రంరెడ్డి పాలెం నుంచీ పెన్షన్ తీసుకుందామని ఎండనపడి వచ్చా. తీరా వస్తే అకౌంట్లో పెన్షన్ పడలేదని చెప్పారు. మళ్ళా ఎప్పుడు రమ్మంటారని అడిగితే చెప్పడం లేదు. ఎప్పుడు అకౌంట్లో డబ్బు పడితే అప్పుడొచ్చి తీసుకో అని చెబుతున్నారు. సరిగా సమాధానం చెప్పేవారే లేరు. ఎన్నిసార్లు తిరగాలో ఏమో...

-సుబ్బయ్య, ఎర్రమరెడ్డిపాలెం, రేణిగుంట మండలం

బ్యాంకులో పడలేదు... సచివాలయంలోనూ ఇవ్వడంలేదు!



నా వయసు 83 ఏళ్ళు. చెర్లోపల్లి బ్యాంకులో పెన్షన్ పడిందేమోనని అడిగితే ఇంకా పడలేదన్నారు. దాంతో మల్లవరం సచివాలయానికి వచ్చి అడిగాము. ఇంకా లిస్టు రాలేదని చెబుతావుండారు. బ్యాంకులో పడుతుంది... మళ్ళా చెక్ చేసుకోండి... పడకపోతే మేమే ఇంటికి వచ్చి ఇస్తామని చెబుతా వుండారు. అంతా అయోమయంగా వుంది. ఎండకు తిరగల్లంటే ఇబ్బందిగా వుంది.

- రామయ్య, సి.మల్లవరం, తిరుపతి రూరల్ మండలం

మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డుప్రమాదంలో ట్యాక్సీ డ్రైవరు సహా ముంబాయి దంపతుల మృత్యువాత





బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జైన కారు - డ్రైవర్ మురుగన్ మృతదేహం

ఏర్పేడు, మే 2: బస్సు ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులూ మరణించిన సంఘటన గురువారం సాయంత్రం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది.సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... ముంబాయికి చెందిన మెక్లొడియస్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లలిత్ సింఘాల్(57), తన భార్య మంజు(52)తో కలిసి తిరుమల వెంకన్న దర్శనార్థం విమానంలో బుధవారం ఉదయం చెన్నైకి చేరుకున్నారు. అక్కడినుంచి ట్యాక్సీలో తిరుపతి వెంకన్న దర్శనానికి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారి దర్శనం తరువాత శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యమైన ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ఉన్న పద్మావతి హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై తిరుపతి వెళుతున్న తమిళనాడు ఆర్టీసీ ఏసీ బస్సు వీరి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ట్యాక్సీ డ్రైవర్ మురుగన్(28) అక్కడికక్కడే మృతి చెందగా లలిత్ సింఘాల్, మంజు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఏర్పేడు పోలీసులు వీరిని తిరుపతి శివార్లలోని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ తుది శ్వాస విడిచారు.వారి కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ముగ్గురి మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



దంపతులు అంజు-లలిత్ సింఘాల్(ఫైల్‌ఫొటోలు)

సకాలంలో వైద్యం అందక నిండు గర్భిణి మృతి



గర్భిణి చెల్లమ్మ మృతదేహం

కేవీబీపురం, మే 2 :సకాలంలో వైద్యం అందక ఓ గర్భిణి మృతి చెందింది.మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు....కేవీబీపురం మండలం రంగయ్యగుంట పంచాయతీ తిమ్మినాయుడుగుంట గిరిజన కాలనీకి చెల్లమ్మకు బుధవారం రాత్రి ప్రసవనొప్పులు ప్రారంభమయ్యాయి.ఏఎన్ఎం, ఆశా వర్కరు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమన్నారు.అయితే అవకాశం లేక గురువారం ఉదయం తీసుకెళదామని కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున చెల్లమ్మకు నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు.అప్పటికి మరో పేషెంటును శ్రీకాళహస్తికి తీసుకెళ్లిన అంబులెన్స్ అక్కడినుంచి కాలనీకి చేరుకునేటప్పటికి సమయం పట్టింది.చెల్లమ్మను అంబులెన్స్‌లో ఎక్కించి కొద్దిదూరం తీసుకువచ్చేసరికి బీపీ బాగా తగ్గిపోయి చెల్లమ్మ అపస్మారక స్థితికి చేరుకుని కాసేపటికి మృతి చెందింది.అంబులెన్సు సిబ్బంది ఆమెకు ఎటువంటి వైద్యం అందించలేదని చెల్లమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు.అంబులెన్సు సిబ్బంది మాత్రం తాము ఫోన్ వచ్చిన వెంటనే బయల్దేరి 37నిమిషాల్లో కాలనీకి చేరుకున్నామని, వాహనంలో కావాల్సిన పరికరాలున్నా చెల్లమ్మ పరిస్థితి అప్పటికే విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు. ఆమెను తీసుకెళ్లి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి అప్పగించగా వైద్యులు పరీక్షించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు.



తిరుపతిలో వర్షం

వానొచ్చింది!

తిరుపతి అర్బన్/తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలుప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం చిరుజల్లులు కురిసాయి.వేసవితాపంతో అల్లాడిపోతున్న జనం వర్షం కురుస్తోందని ఆనందించేలోపు ఆగిపోవడంతో నీరసపడ్డారు.పెద్దవర్షం కాకపోవడంతో ఉక్కబోత మరింత పెరిగింది. తిరుమలలో మాత్రం ఉరుములు, భారీ ఈదురుగాలతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు భారీగా ఉరుములతో కూడిన వాన పడింది. పాకాల మండలంలో గాలి వానతో పలు చోట్ల చెట్లకొమ్మలు విరిగిపోయాయి. ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.రామచంద్రపురం మండలంలోని అనుపల్లి, వేపకుప్పం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.మామిడికాయలు నేలరాలాయి.

తుమ్మలగుంటలో టీడీపీనేతల ప్రచారం



తిరుపతి రూరల్, మే 2: తిరుపతి రూరల్ మండలంలోని తుమ్మలగుంట ఎస్సీ కాలనీలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి బిరుదాల భాస్కర్ రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కె.శ్రీనివాసులు, బి.వేణుగోపాల్‌రెడ్డి, బి.సిద్ధారెడ్డి, జి.చెంగ్రలామానాయుడు, జి.రాధారాయల్, పి.జయచంద్రారెడ్డి, కె.రేవంత్‌రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, ఎం.అయ్యప్ప, ఎస్.మురళి, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే టీడీపీ లక్ష్యం



భాకరాపేటలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

భాకరాపేట, మే 2: మహిళా సాధికారతే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని చిన్నగొట్టిగల్లు మండల వైస్‌ఎంపీపీ సునీత దామోదరం అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట, కోటబైలు, చట్టేవారిపాళెం పంచాయతీలలో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి, టీడీపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కొట్టె శివకుమార్, కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, సుబ్రహ్మణ్యం, విజయశేఖర్ గౌడ్, డిష్ మణి, మునిచంద్ర, లోకనాథం, మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్, తులసీరాయల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'హలో లోకేశ్'కు భారీగా తరలిన తెలుగు యువత



భాకరాపేట, మే 2: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చంద్రగిరి మండలం తొండవాడలో ఏర్పాటు చేసిన 'హలో లోకేశ్' కార్యక్రమానికి చిన్నగొట్టిగల్లు మండలం నుంచి తెలుగు యువత నాయకులు భారీగా తరలివెళ్లారు. భవిష్యత్తుకు భరోసా, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై చర్చ జరగనున్నదని ప్రతి పంచాయతీ నుంచి భారీగా తెలుగు యువత తరలి వెళ్లారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం



టీడీపీ నాయకుల ఇంటింటా ప్రచారం

రామచంద్రాపురం, మే 2: మండలంలోని రావిళ్లవారిపల్లె, రాయలచెరువుపేట, కమ్మకండ్రిగ గ్రామాల్లో టీడీపీ నాయకులు గురువారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించి, పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్థన్ చౌదరి, గిరి నాయుడు, జయచంద్ర నాయుడు, నరసింహారెడ్డి, మాధవయ్య, ఢిల్లీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఆర్వో

తిరుపతి(కలెక్టరేట్), మే 2: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. ఓటర్ల చైతన్యం కోసం స్వీప్ ద్వారా షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమంగా చిత్రీకరించిన పలు షార్ట్‌ఫిలిమ్స్‌ను ఎంపిక చేశారు. వారికి గురువారం కలెక్టరేట్‌లో జ్ఞాపికలు అందజేశారు. ఓటు హక్కు విలువను తెలియజేస్తూ సందేశాత్మకంగా షార్ట్ ఫిలిం తీసిన యువతను అభినందించారు. స్వీప్ నోడల్ అధికారి మురళీకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



ప్రసంగిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), మే 2: పిల్లల సక్రమమైన ఎదుగుదల మీదనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తిరుపతిలోని శ్రీరామకృష్ణ ఆశ్రమ ఆవరణలో ఈ నెల 15వ తేదీ వరకు జరిగే విద్యార్థులు సంస్కార శిబిరం అన్న పేరుతో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన గురువారం ఉదయం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శ్రీరామకృష్ణాశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద స్వామి మాట్లాడుతూ.. బాల్యం నుంచే శీలవంతమైన జీవన విధానం, భారతీయ విలువలు, సంగీతం, చిత్రకళ వంటి అంశాలను శిబిరంలో విద్యార్థులకు నేర్పిస్తున్నట్లు తెలిపారు. విద్వత్ పాఠశాల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, స్వామి సత్వస్థానంద, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాయంత్రం 80మంది మహిళలకు పూలదండల తయారీలో శిక్షణ ఇచ్చారు.

రోడ్డుపై మురుగునీరు
- ప్రజలకు తప్పని అవస్థలు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పాకాల, మే 2: మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లె ముఖద్వారం వద్ద రోడ్డుపై మురుగునీరు పారుతోంది. గ్రామానికి వెళ్లాలంటే మురుగునీటి పైనే వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువ నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రైవేటు స్థలంలో గుంత తీసి మురుగునీరు వదిలారు. గుంత నిండి తరచూ మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. పలుసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగునీటి కాలువ నిర్మించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీటిగుంటలోపడి ఆరేళ్ల బాలుడి మృతి



పవన్ శంకర్ (ఫైల్ ఫొటో), గంటా కృష్ణను పరామర్శిస్తున్న వినీల్

మంగళం, మే 2: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గంటా కృష్ణ కుమారుడు పవన్ శంకర్(6) బుధవారం మృతి చెందాడు. సెలవులు కావడంతో ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని తమ అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఆడుకుంటున్న సమయంలో నీటిగుంటలో పడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పవన్ మృతదేహాన్ని తిరుమలనగర్‌లోని నివాసానికి తరలించారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని కుమారుడు పులివర్తి వినీల్ గురువారం తిరుమలనగర్‌లోకి నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. కృష్ణ కుటుంబీకులను ఓదార్చారు.

చంద్రగిరి

గాలి వానతో విరిగిపడిన చెట్లు
ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం



పాకాల ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గాలి వానకు విరిగిపడిన చెట్టు కొమ్మ

పాకాల, మే 2: మండలంలో గురువారం మధ్యాహ్నం గాలితో కూడిన వర్షం కురిసింది. గాలులు వీచడంతో పలు చోట్ల చెట్లకొమ్మలు విరిగిపోయాయి. పాకాల ఆర్టీసీ బస్టాండు ఎదుట చాండీ చౌక్ రైల్వే ప్రహరీ గోడ పక్కన నున్న చెట్టుకొమ్మ విరిగి రోడ్డుపై పడింది. నిత్యం రద్దీగా వుండే ఈ ప్రాంతంలో చెట్టుకొమ్మ విరిగి పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. పాకాల - తోటపల్లె రోడ్డు భారతంమిట్ట 9వ వీధి చివర విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఐదు గంటల పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది శ్రమించి విరిగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు లాగి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో సరఫరాను పునరుద్ధరించారు. ఓ మోస్తరుగా కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడింది.

ఆర్‌సీపురంలో తేలికపాటి వర్షం



అనుపల్లిలో కురుస్తున్న వర్షం

రామచంద్రాపురం, మే 2: మండలంలోని అనుపల్లి, వేపకుప్పం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం గురువారం మధ్యాహ్నం కురిసింది. రాయలచెరువుకట్ట కింద హోరుగాలికి గంగిరెడ్డి ప్రాంతాల్లో చిన్నపాటి చెట్లు విరిగాయి. మామిడికాయలు నేలరాలాయి. ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జనం కొంత ఉపశమనం పొందారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి

తిరుచానూరు, మే 2: తిరుచానూరు పంచాయతీ పొన్నకాల్వ సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద ఓమామిడి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి (40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడు నలుపు రంగు ప్యాంటు, పసుపురంగు చొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో తెలియచేయాలని ఎస్‌ఐ కోరారు. మృతుడు ఆత్మహత్యకుపాల్పడి దాదాపు నాలుగైదు రోజులు ఉంటుందని తెలిపారు.

నిమ్మరైతు పంట పండింది

గూడూరు అర్బన్, మే 2: గూడూరు నిమ్మమార్కెట్‌లో రైతులకు కాసుల పంట పండుతోంది. గురువారం కిలో నిమ్మకాయలను రికార్డు స్థాయిలో రూ.122కు డీబీఆర్ కంపెనీ కొనుగోలు చేసింది. వేసవి తాపం ఉధృతంగా ఉండటంతో పాటు ఉత్తరభారత ప్రాంతాల్లో డిమాండ్ పెరగడంతో నిమ్మధరలకు రెక్కలొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. 50 కిలోల టిక్కీ బస్తా ధర రూ.6,100 కాగా, లూజు 80 కిలోల బస్తా ధర రూ.9,760 పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. గతవారం ఇదే నిమ్మ ధరలు కాయల నాణ్యతను బట్టి కిలో ధర రూ.60నుంచి రూ.90వరకు పలికాయి. గురువారం కిలో రూ.80 నుంచి రూ.122 వరకు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ధరలు ఇంకా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జీవకోనలో కాంగ్రెస్ ప్రచారం



కాంగ్రెస్ నేతలతో చింతా మోహన్

తిరుపతి(కపిలతీర్థం), మే 2: జీవకోన, రాజీవ్ గాంధీనగర్, ఎంఆర్‌పల్లె, అన్నమయ్య సర్కిల్, పాత మున్సిపల్ కార్యాలయం, గాంధీరోడ్డు పరిసర ప్రాంతాల్లో గురువారం కాంగ్రెస్ నేతలతో కలిసి తిరుపతి ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతా మోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, నేతలు తేజోవతి, మునిశోభ, శాంతియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు పాటించాలి

తిరుపతి(వైద్యం), మే 2: ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనల మేరకు అగ్నిప్రమాద నివారణ చర్యలు పాటించకపోతే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో శ్రీహరి హెచ్చరించారు. నారాయణాద్రి, మారుతీ ఆస్పత్రులను ఆయన గురువారం తనిఖీ చేశారు. డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేక్, టీలతో సరిపెట్టారు!
శిక్షణలో ఇబ్బంది పడ్డ పోలింగ్ సిబ్బంది

వెంకటగిరి, మే 2: వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పీవోలు, ఏపీవోలకు రెండో విడత శిక్షణ ఏఆర్‌వో ఆధ్వర్యంలో గురువారం జరిగింది. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అధికారులు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు. ఉదయం 11.30 గంటలకు టీ, కేకులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో భోజనం ఏర్పాటు చేశారు. ఆలస్యమవడంతో ఐదుగురు స్పృహ కోల్పోయారు. దీంతో వారిని సమీపంలోని వైద్య శిబిరానికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇక ఏమార్చలేరు



పబ్లిక్ అజెండా

- మా సమస్యను తీర్చేవారెవరో
- క్లారిటీ వచ్చేసింది గంపగుత్తుగా వారికే మా ఓటు
- 'శెట్టిపల్లె' బాధితుల మనోగతం

'ఎన్నికల సమయంలో ఏమార్చి ఓట్లు దండుకుని, అవసరం తీరాక పాలకులు మాకు శఠగోపం పెడుతూ వచ్చారు. ఈసారి అలాకాదు.. మాటచెప్పి మోసం చేసినవారిని శాశ్వతంగా ఇంటికే పరిమితం చేస్తాం. ఇక మమ్మల్ని ఏమార్చలేరు. ఎవరు అధికారంలోకి వస్తే మాకు న్యాయం జరుగుతుందో స్పష్టత వచ్చింది. వాళ్లకే మా పూర్తి మద్దతు ఉంటుంది' అని శెట్టిపల్లె బాధితులు తెలిపారు. 'శఠగోపం పెట్టేశారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. దశాబ్దాల తమ వ్యథను కళ్లకు కట్టినట్టు ఆవిష్కరించిన ఈ కథనాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ.. దగాచేసిన పాలకులు వైఖరిపై మండిపడుతున్నారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం రైతులకు ఏమాత్రం న్యాయం చేయలేదు. మా తాతల కాలం నుంచి భూములు అనుభవిస్తున్నాం. అక్కరకు ఉపయోగపడడంలేదు. కేవలం ప్రొసీడింగ్ పేపర్లు ఇచ్చి అందరినీ మభ్యపెట్టారు. అందువల్ల ఈ దఫా తమ సమస్యను తీర్చే వారికే గంపగుత్తుగా ఓట్లు వేసేందుకు సిద్ధమయ్యామని చెబుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఊరించి ఉసూరుమనిపించారు



మాగ్రామాన్ని కార్పొరేషన్లో విలీనం చేయడం ఎవ్వరికీ ఇష్టంలేదు. గ్రామసభలో కూడా అంగీకరించలేదు. మా సమస్యను సెటిల్ చేస్తారని మభ్యపెట్టి రాత్రికిరాత్రే తీర్మానాలు చేసేశారు. పద్మావతిపురం పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయనకు అవసరంలేని కార్పొరేషన్ పరిధి మాకు ఎందుకు? ఇక్కడ వేలకోట్ల రూపాయల విలువైన భూములు ఉన్నాయి కాబట్టే ప్రేమ చూపించారు. ఐటీ హబ్‌లు కడతామని ఊరించి ఉసూరుమనిపించారు. గతంలో జనసేన పార్టీ మా సమస్యపై పోరాటం చేసింది. ఎవరు న్యాయం చేయగలరో మాకు క్లారిటీ వచ్చింది.

- కృష్ణమూర్తి, శెట్టిపల్లె రైతు

అదిగో..ఇదిగో అంటూ కాలం గడిపేశారు



డ్రైవర్‌గా పనిచేస్తూ పైసా పైసా కూడబెట్టుకుని 2014 సంవత్సరంలో శెట్టిపల్లెలో 24 అంకణాల ప్లాటు కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం శెట్టిపల్లె భూముల సమస్యకు పరిష్కారం చూపలేదు. ప్రొసీడింగ్స్ ఇచ్చారు కానీ ఇల్లు కట్టుకునేందుకు స్థలంలోకి వెళితే రెవెన్యూ అధికారులు నిర్మించిన గోడలను కూడా తొలగించారు. మాకు ఏమాత్రం న్యాయం జరగలేదు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకమూ లేదు. ప్రధానమైన మా డిమాండును పరిష్కరించేవాళ్లనే చిరస్థాయిగా నమ్ముతాం.

- సురేష్, ప్లాట్ కొనుగోలుదారుడు

మంచి చేసినోళ్లకే మా ఓటు



ఎలాగైనా సొంత ఇల్లు కట్టుకోవాలని 2013లో 31అంకణాలు స్థలాన్ని కొనుగోలు చేశాను. ఇల్లు కట్టుకుందామని వెళితే రెవెన్యూ అధికారులు కుదరదంటున్నారు. ప్రతినెలా రూ.7వేల ఇంటి బాడుగ కట్టేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సొంతింటి కలను సాకారం చేసుకుందామనే ఉద్దేశంతో కొనుగోలు చేశాను. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం.. ప్లాట్ల కొనుగోలుదారులకు ఏమాత్రం న్యాయం చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్న నమ్మకం మాకు ఉంది. మాకు న్యాయం చేసే వారికి ఓటు వేస్తాం.

- వెంకటాద్రి, ప్లాట్ కొనుగోలుదారుడు

లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పార్టీలో చేరిన చంద్రగిరి, తిరుపతి, చిత్తూరు వైసీపీ నాయకులు



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు నాయకులు

చంద్రగిరి, మే 2: ప్రజా ప్రభుత్వ స్థాపనకు కలిసి రావాలన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునకు విశేష స్పందన లభిస్తోంది. చంద్రగిరి, తిరుపతి, చిత్తూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ ప్రముఖులు గురువారం తొండవాడ జీబీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన యువగళం క్యాంపులో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం, మొగరాల సర్పంచ్ బుట్టా మధు నాయుడుతో పాటు 100 మంది అనుచరులు, చినకూరపాడుకు చెందిన గుంటూరు గజేంద్ర నాయుడు, వంశీతో సహా 100 మంది అనుచరులు టీడీపీలో చేరారు. వీరితో పాటు చిత్తూరు కార్పొరేషన్ వైసీపీ కోఆర్డినేటర్ ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి సహా 25 మంది, గుడిపాల మండల ఎంపీటీసీ జి. హరిప్రసాద్ చౌదరితో సహా ఐదుగురు, తిరుపతి నియోజకవర్గానికి చెందిన డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆల్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి రఫీ హిందూస్థానీ సహా 30 మంది ముస్లిం మత పెద్దలు టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. మరో పది రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో విధ్వంస పాలనకు ముగింపు పడుతుందని చెప్పారు. పార్టీలో చేరిన వారు తెలుగుదేశం భారీ విజయానికి కృషిచేయాలని కోరారు.

నా పెళ్లి మీ చేతుల్లోనే వుంది

యువతీయువకుల ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చిన లోకేశ్




చంద్రగిరి, మే 2: చంద్రగిరి మండలం ఐతేపల్లె సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన హలో లోకేశ్ కార్యక్రమంలో యువత పలు ప్రశ్నలను సంధించగా, లోకేశ్ ఓపిగ్గా సమాధానాలిచ్చారు.



వెంకట్, బీటెక్ : ప్రభుత్వం ఉద్యోగం వస్తే పెళ్లి చేసుకోవాలనుకొన్నా.2019లో బీటెక్ పూర్తి చేశా. జగన్‌రెడ్డి మేనిఫెస్టోలో జాబ్ క్యాలెండర్ ఇస్తామన్నారు.ఇంత వరకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఉద్యోగమిస్తే నాకు పెళ్లయ్యే అవకాశం ఉంది.

లోకేశ్: కూటమి ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ విడుదల చేస్తాం. 2.30 లక్షల పెండింగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం.జగన్‌రెడ్డి ఎన్నికలు వస్తున్నాయనే హడావుడిగా గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్ ఇచ్చారు. మేం అలా కాదు.కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి సంతకం మెగా డీఎస్సీపై ఉంటుంది. డీఎస్సీలో జాబ్ వస్తుంది. నీ పెళ్లికి నన్ను పిలవాలి. పాపాలు చేసే వారు ఎమ్మెల్యేగా ఉన్నా, ముఖ్యమంత్రిగా ఉన్నా పరిశ్రమలు, పెట్టుబడులు రావు. ఇక్కడ చెవిరెడ్డి కుటుంబాన్ని ఓడించండి. చంద్రగిరికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చే బాధ్యత నేను తీసుకొంటా.

నవీన, దుర్గసముద్రం: జగన్‌పై గులకరాయి దాడి చేసింది మీరే అని చెబుతున్నారు. ఆ రాయికి చీమ కూడా చనిపోదు.



లోకేశ్: అది స్పెషల్ ఇంపోర్టెడ్ రాయి. ఎవరో వేశారంట. ముఖ్యమంత్రికి తగిలింది. పక్కనే ఉన్న వెల్లంపల్లి శ్రీనివాసులుపై కన్నుపైనా పడిందట. అంతా డ్రామా.

చిరంజీవి, పరమాల: ఆంధ్రాలో మద్యం ప్రధాన సమస్యగా ఉంది. మరోవైపు జగన్మోహన్‌రెడ్డి మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకొంటామని భయపడుతున్నారు.



లోకేశ్: మద్యం ఆరోగ్యానికి హానికరం. పాత బ్రాండ్లు కావాలంటున్నారు.పాత మద్యం విధానం అమలు చేస్తాం, మద్యం అలవాటు తగ్గించే బాధ్యత తీసుకొంటాం.

హరి, ఓటేరు: డిగ్రీలు పూర్తయినా ఉద్యోగాలు రావడం లేదు. మా గ్రామంలో చదువుకున్న వాళ్ళు 22 మంది ఉన్నారు. స్విగ్గీ, జొమోటోల్లో పనిచేస్తున్నారు. ఈ ఐదేళ్లు ఏం చేశారని రెజ్యూమ్‌లో పెట్టాలి.

లోకేశ్: దేశంలో అందరికీ మన ముఖ్యమంత్రి సైకో అని తెలుసు. రెజ్యూమ్‌లో సైకో జగన్ వల్ల నష్టపోయామని పెట్టండి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బడాచోర్ చైనీస్‌ను కూడా భయపెట్టారు. మళ్లీ పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొస్తాం. చెవిలో పువ్వు పెట్టే చెవిరెడ్డిని గెలిపిస్తే పరిశ్రమలు రావు.

జయచంద్ర, పాకాల: ఐటీ ఉద్యోగాలు కల్పించాలి సార్

లోకేశ్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నం కేంద్రంగా ఐటీ పెట్టుబడులు తీసుకొస్తాం. తిరుపతికి పరిశ్రమలు తీసుకొచ్చిన ఘనత మనదే, ఒక నెల ఓపిక పట్టండి, కోడిగుడ్డు మంత్రి ఇంటికి వెళ్లడం ఖాయం, మళ్లీ ఐటీ పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత మనం తీసుకొంటాం.

చందనశ్రీ, గంగనగుంట: విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తారా

లోకేశ్: కేజీ నుంచి పీజీ వరకు బలోపేతం చేయాలి. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంది. ఇప్పుడు విద్యాదీవెన, వసతి దీవెన అంటున్నారు. బటన్ నొక్కినా డబ్బులు పడటంలేదు. పాత విధానం తీసుకొస్తాం.

భవిత, బొల్లినేనిరామయ్యగారిపల్లె: విదేశీ విద్యకు అవకాశం ఉందని వెళ్తే ప్రభుత్వం మారిన వెంటనే డబ్బులు పడలేదు. మా గ్రామంలో ఇప్పటికీ తాగు నీటి సమస్య ఉంది. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని విదేశీ విద్య గురించి అడిగితే చులకనగా మాట్లాడారు.

లోకేశ్:జగన్ తన ఇద్దరు బిడ్డలనూ విదేశాల్లోనే చదివిస్తున్నాడు.మన బిడ్డలు మాత్రం విదేశాల్లో చదువుకోకూడదా?ఆపేసిన విదేశీ విద్య పథకాన్ని తిరిగి ప్రారంభిస్తాం.

తేనీష్, తుమ్మలగుంట: తుమ్మలగుంట చెరువు కబ్జాకు గురైంది. అందులో స్పోర్ట్స్ క్లబ్ కట్టారు. దాని వల్ల నీటి సమస్య వచ్చింది. ఆ చెరువులో నీరు తెప్పిస్తారా?

లోకేశ్: ప్రభుత్వ రికార్డులో ఏది ఉంటే అదే చేస్తాం. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందిస్తాం

పార్థు, మిట్టకండ్రిగ: ఎస్సీలకు గతంలో రాయితీ రుణాలు, వాహనాలు ఇచ్చేవారు. వైసీపీ రాగానే నిలిపివేశారు. టీడీపీ వస్తే మళ్లీ ఇస్తారా?

లోకేశ్: గతంలో టీడీపీ ప్రభుత్వంలో రాయితీ అందించాం. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. మేం రాగానే కార్పొరేషన్‌ల ద్వారా నిరుపేద కుటుంబాలను ఆదుకుంటాం.

మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి : ప్రజలకు మేధావుల పిలుపు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 2: రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం కంటే అప్పే ఎక్కువగా ఉందని పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులను అనుత్పాదక రంగాలకు కేటాయించడం వల్ల రాష్ట్రం అధోగతి పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్, ఇసుక, మట్టి తదితరాలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే వాటిని కబ్జా చేస్తున్నారని, ఉన్నత లక్ష్యాలతో ప్రారంభించిన సీఎఫ్‌ఎంఎస్‌ను రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి ఉపయోగిస్తున్నారని ఆక్షేపించారు. ప్రభుత్వాధినేతలు ఆధునిక రాజులుగా మారి, ప్రజా సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. కులం, మతం, ప్రాంతాల పేరుతో ప్రజలను విడదీసి నీచ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివన్నింటినీ నిర్మూలించి ప్రజలు, రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే వారిని ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీవీ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పీవీ రమేశ్, ప్రముఖ రాజనీతి ఆచార్యులు కొండవీటి చిన్నయసూరి, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది పి.రవితేజ మాట్లాడారు. కార్యక్రమంలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కోశాధికారి, ప్రముఖ ఆడిటర్ ఫల్గుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజలకు భలే గిరాకీ



తిరుపతి(నేరవిభాగం), మే 2: మండిపోతున్న ఎండల నుంచి సేద తీరేందుకు జనం తాటి ముంజలు కొనుగోలు చేయడానికి ఎగబడుతున్నారు. డజను రూ.100కు విక్రయిస్తున్నారు. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున తాటి ముంజలకు మరింత డిమాండ్ ఉంటుందని వ్యాపారులు అంటున్నారు.

వేదిక్ వర్సిటీలో రెండోరోజుకు సదస్సు



మాట్లాడుతున్న వీసీ

తిరుపతి రూరల్, మే 2: ఎస్వీ వేదిక్ వర్సిటీలో నిర్వహించే విశ్వ వైదిక విజ్ఞాన సమ్మేళన సదస్సులో భాగంగా గురువారం రెండో రోజు వైదిక వాఙ్మయంలోని అనేక అంశాలపై పలువురు పరిశోధనాపత్రాలను సమర్పించారు. వీసీ రాణీసదాశివమూర్తి అధ్యక్షతన జరిగిన మొదటిసెషన్‌లో ప్రాచీనయోగశాస్త్రంలో చెప్పబడిన థెరపీ విషయాలపై డాక్టర్ జ్యోతి పరిశోధనాపత్రం సమర్పించగా.. ఉజ్జయినీ వేదసంస్కృత వర్సిటీ వీసీ విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన రెండో సెషన్‌లో కాత్యాయన శిల్పసూత్రంలోని ఖగోళ రహస్య విషయంలో భారతీయ జామితీ విషయాలపై ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు, మూడవసెషన్‌లో డాక్టర్ అయాజ్‌శంతను ఆధునిక యోగిక ఆహార పదార్థాల గురించి విశదీకరించారు. నాల్గవసెషన్‌లో నాణ్యమైన జీవనానికి ఆయుర్వేదంలో చెప్పబడ్డ విషయాలను ప్రొఫెసర్ మురళీకృష్ణ, న్యాయశాస్త్ర ఆధునిక విషయాలపై డాక్టర్ కేతు వెంకటనాథం, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే అంశాలపై డాక్టర్ రాజేంద్రప్రసాద్ వంత్‌లు వివరించారు. రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, తారకరామశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, ఫణియాజులు, బ్రహ్మచార్యులు పాల్గొన్నారు.

'గాజు గ్లాసు'ను బలంగా తీసుకెళ్లండి

ఆరణి, సుగుణమ్మలతో నారా లోకేశ్



లోకేశ్‌తో సుగుణమ్మ, ఆరణి, నరసింహయాదవ్, యశ్వంత్ రెడ్డి

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): హలో లోకేశ్ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఎన్డీయే కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, భట్టే లవకీర్తి, అన్నా సంధ్య కలిశారు. గాజుగ్లాసు గుర్తుతోపాటు సీరియల్ నెంబరు 3ను బలంగా తీసుకెళ్లాలని లోకేశ్ ఈసందర్భంగా వారికి సూచించారు. ఎన్నికల కోడ్‌లో కూడా కొంతమంది అధికారులు వైసీపీకి కొమ్ముకాస్తున్నారని లోకేశ్ దృష్టికి ఆరణి తీసుకెళ్లారు. చట్టప్రకారం అందరిపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే లోకేశ్‌ని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, జిల్లా కార్యదర్శి యశ్వంత్ రెడ్డి కూడా కలిశారు.

7న పవన్‌కల్యాణ్ తిరుపతి రాక

తిరుపతి అర్బన్, మే 2: సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిమిత్తం జనసేనాని పవన్‌కల్యాణ్ ఈనెల 7న తిరుపతికి రానున్నారు. అదే రోజున చంద్రగిరి నుంచి వారాహి రోడ్‌షో, తిరుపతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యం, తిరుపతిలో జనసేన అభ్యర్థి పోటీ చేస్తుండడంతో ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. పూర్తివివరాలు త్వరలో ప్రకటించనున్నారని తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ పేర్కొన్నారు.

యువతకు మంచి భవిష్యత్తు

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



తిరుపతి అర్బన్, మే 2: రాబోవు రోజుల్లో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ అన్నారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం కిరణ్‌రాయల్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. గురువారం 16వ డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ.. ఓటర్లకు మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. అందరికీ సమన్యాయం జరగాలంటే గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో జనసేన జెండా ఎగురవేసి భూకబ్జాదారులను తరిమికొట్టి.. బాధితులకు న్యాయం జరిగే వరకు నిద్రపోమన్నారు. ఈ సందర్భంగా కిరణ్‌కు ఎదురుపడిన యశ్వంత్ అనే యువకుడు మాట్లాడుతూ.. 'అన్నా మా ఫ్యామిలీ పవన్‌కల్యాణ్ అభిమానులం. ఐదేళ్లుగా మీ పోరాటం చూస్తున్నాం. అన్ని ఓట్లూ గాజుగ్లాసుకే వేస్తాం' అన్నాడు. ఈ కార్యక్రమంలో ఆరణి శిరీష శివకుమార్, అబ్జర్వర్ జిల్లేడు అరుణ్ కుమార్, కృష్ణయాదవ్, ఆనంద్‌బాబుయాదవ్, రమేష్‌యాదవ్, లెనిన్‌ప్రసాద్, మనోజ్, షరీఫ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ సూపరింటెండెంటు జానకిరామ్



తిరుపతి(నేరవిభాగం), మే 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం, సారాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరాం చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎక్కడైనా అక్రమ మద్యం, సారా విక్రయాలు జరుగుతుంటే వెంటనే కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నెంబర్ల (సూర్యతేజ - 9177119097), (అఫ్జల్‌ఖాన్ -9494697312)కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి: కలెక్టర్

తిరుపతి అర్బన్, మే 2: సిబ్బంది బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం కచ్చపి ఆడిటోరియంలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రొసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్వో అదితిసింగ్ మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు 12న ఎస్వీఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చి తమ తమ పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎంలను, వీవీ ప్యాట్లను, మిగతా సామగ్రిని స్వాధీనం చేసుకోవాలన్నారు. 13న ఉదయం 5గంటలకు పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమన్వయంతో వ్యవహరించి పోలింగ్ విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో ధృతి ఆడిటోరియంలో చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని పీఓ, ఏపీఓలకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... పీఓ డైరీ, ఇతర పత్రాలు ఎప్పటికప్పుడు ప్రిసైడింగ్ అధికారులు నమోదు చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు పక్కాగా ఎన్నికల బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ నియమావళిని కచ్చితంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అవసరం మేరకు వీడియోగ్రఫీ, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసుల సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి రిటర్నింగ్ అధికారి నిషాంత్ రెడ్డి పాల్గొన్నారు.

బైండోవర్ కేసులపై టీడీపీ, జనసేన నిరసన



పోలీసుల తీరుపై డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు కిరణ్ రాయల్

తిరుపతి (నేరవిభాగం), మే 2: నగరంలో గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జనసేన, టీడీపీ నాయకులు కిరణ్ రాయల్, కట్టా జయరాం యాదవ్, ఊకా విజయకుమార్‌లను బైండోవర్ కేసుల కింద తహశీల్దార్ వద్ద హాజరుపరిచినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సంతకాలు చేయాల్సిందిగా పోలీసులు విజ్ఞప్తి చేయగా, వారు నిరాకరించి వెనక్కు వచ్చేశారు. అనంతరం వారు డీఆర్వో పెంచలకిషోర్‌ను, అదనపు ఎస్పీ వెంకటరావులను కలిసి పోలీసులు మమ్మల్ని వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.62 కోట్లు

తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.62 కోట్లు లభించింది. మంగళవారం ఉదయంనుంచి రాత్రివరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 72,510 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,441 మంది తలనీలాలు సమర్పించారు.

స్థానికులను మతించని నాయకులను మేం ఆదరించం!

● పెద్దకాపు వీధిపై భూమన పగబట్టారు
● టౌన్‌బ్యాంకు ప్రతిష్టను దెబ్బతీశారు
● టీడీపీ సీనియర్ నేత పులుగోరు మురళీకృష్ణారెడ్డి



తిరుపతి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర ఉన్న నాయకుడు పులుగోరు మురళీకృష్ణారెడ్డి. తిరుపతికి గుండె వంటి ప్రాంతాల్లోని స్థానికుల్లో మంచి బంధుమిత్ర పరివారం ఉన్న నాయకుడు. 2014 ఎన్నికల్లో వెంకటరమణ విజయానికి కీలకంగా కృషిచేశారు. 12 ఏళ్లకు పైగా తిరుపతి టౌన్ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. ఎన్డీయే కూటమి విజయం కోసం ప్రచారంలో ఉంటున్న పులుగోరు మురళీకృష్ణారెడ్డితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

ఫటాఫట్!

? అసంతృప్తిని పక్కన పెట్టేసినట్టున్నారు.

! తిరుపతిలో టీడీపీకి బలమైన లీడర్, కేడర్ ఉంది. ఐదేళ్లుగా పోరాటం చేశాం. ఈనేపథ్యంలో టికెట్ దక్కక పోవడంతో తొలుత కాస్త అసంతృప్తితో ఉన్నమాట వాస్తవమే. మా అధినేత చంద్రబాబు ఆదేశాలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుజ్జగింపులు మామీద చాలా పనిచేశాయి. ముఖ్యంగా భూమనపై ఉన్న వ్యతిరేకత కూటమి అభ్యర్థి గెలుపుకోసం పనిచేసేలా అసంతృప్తులంతా ఏకతాటిపైకి వచ్చాం.

? టౌన్‌బ్యాంకు పరిస్థితి ఏమిటి.

! వందేళ్లకు పైగా ఘన చరిత్ర కలిగిన తిరుపతి టౌన్‌బ్యాంకు చైర్మన్‌గా 12ఏళ్లకు పైగాపనిచేశా. లక్షా యాభైవేల మంది వినియోగదారులు వున్నారు. ప్రధాన శాఖద్వారా 6వేల మందికి దాదాపు రూ.200 కోట్లు ఇంటి రుణాలు ఇచ్చాం. చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లో కూడా లోన్లు ఇచ్చాం. వైసీపీ అధికారంలోకి వచ్చాక టౌన్‌బ్యాంకును భ్రష్టుపట్టించేశారు. వివాదాల పుట్టగా మార్చేశారు. దీంతో పెద్దఎత్తున ఖాతాదారులు తమ ఎఫ్‌డీలను వెనక్కి తీసికెళ్లిపోయారు.

? భూమన పట్ల తిరుపతి స్థానికుల్లో వ్యతిరేకత ఉందా.

! తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డిని, అతని కుమారుడు అభినయ్‌రెడ్డిని స్థానిక రెడ్లు అంగీకరించడం లేదు. దొడ్డారెడ్డి, యాలమూరి, ఆవులు, ఇరికి, పురుమోళ్ల, పులుగోరు కుటుంబాలన్నీ అసంతృప్తితో ఉన్నాయి. ఆకుతోట రెడ్లు, బండ్లవీధిలోని దేశూరు రెడ్లు, పాకనాటి రెడ్లు.. ఇలా అందరూ భూమనకు దూరంగానే ఉన్నారు. బయట నుంచి వచ్చి తిరుపతిలో సెటిలైన కొందరు కడపరెడ్లు తప్ప, స్థానికంగా వుండే రెడ్లు భూమనకు ఓటు వేసే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆయన ప్రవర్తన వల్ల. ఎవరైనా వెళితే ఆప్యాయపు పలకరింపు వుండదు. పైనుంచి దిగొచ్చినట్టుగా వ్యవహరిస్తారు. ఏ విషయంలోనూ మమ్మల్ని ఎన్నడూ సంప్రదించలేదు. అసలు మతించరు. మమ్మల్ని గౌరవించి, ఆప్యాయంగా పలకరించేవాళ్లనే లోకల్ అయిన మేము ఆదరిస్తాం.

? పెద్దకాపు వీధిపై భూమన పగబట్టారనే విమర్శ ఎందుకొచ్చింది.

! గత ఎన్నికల్లో అక్కడ వైసీపీకి మెజారిటీ రాలేదని పగపెట్టుకున్నారు. శ్రీనివాసం నుంచి పెద్దకాపు వీధికి వెళ్లే రోడ్డును అడ్డంగా తవ్వేశారు. లాడ్జీల వ్యాపారలను దెబ్బతీశారు. రోడ్డు వేయమని అడిగితే రూ.2కోట్లు లంచం అడిగారని తెలిసింది. అదేవిధంగా పెద్దకాపులేఅవుట్‌లో మార్వాడీలు ఎక్కువగా వున్నారు. తిరుపతి మొత్తం 400 కుటుంబాలు వున్నాయి. వారిని కూడా వైసీపీ నేతలు బెదిరిస్తుంటారు. భయంతో నోరు మెదపని వీరంతా ఎన్నికల్లో తమ అభిప్రాయం ప్రకటిస్తారు..

? ఆరణితో మీ సంబంధాలు ఎలా ఉన్నాయి.

! ఆయన ఎంతో సౌమ్యుడు. మర్యాదస్తుడు. చిత్తూరు జిల్లా వాసి. వ్యాపార, రాజకీయాలపరంగా తిరుపతిలో నిత్యం కనిపిస్తుంటారు. పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థిగా ఆయనకు టికెట్ ప్రకటించిన తర్వాత ఎన్డీయేలోని సామాన్య కార్యకర్తల ఇళ్ల వద్దకు కూడా ఆయన నేరుగా వెళ్లి ఆశీస్సులు కావాలని అభ్యర్థించారు. ఒకటికి పదిసార్లు ఫోన్లు చేసి ప్రాధేయపడ్డారు. భూమన కుటుంబంలో అలాంటి ప్రవర్తన ఇసుమంతైనా కనపడదు.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

మార్పు కోసం ఓటెయ్యండి

ప్రజలకు సేవ చేయడమే కూటమి నేతల లక్ష్యం

క్రైస్తవుల అవసరాలన్నీ తీరుస్తా - ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): మార్పు కోసం ఓటువేయాలని, రాష్ట్రం మొత్తం మార్పు రాబోతోందని, ప్రజలకు సేవ చేయడమే కూటమి నేతల లక్ష్యమని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గురువారం తిరుపతి క్రైస్తవులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆరణి పాల్గొన్నారు. చర్చిలకు ప్రహరీ నిర్మించాలని పలువురు కోరగా.. తాము అధికారంలోకి రాగానే ప్రహరీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు అవసరాలన్నీ తీరుస్తామని ఆరణి హామీ ఇచ్చారు. క్రైస్తవులకు జగన్మోహన్ రెడ్డి ఎటువంటి సాయం చేయలేదన్నారు. పాస్టర్స్‌కు గౌరవ వేతనం ఇస్తామని చెప్పి.. మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. తిరుపతిలో ఎవరైనా చర్చి నిర్మించేందుకు ముందుకు వస్తే తన వంతు సాయం చేస్తామని మాట ఇచ్చారు.



క్రైస్తవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి

నైనార్ శ్రీనివాస్‌తోపాటు 750మంది చేరిక

వైసీపీ కాపు నేత నైనార్ శ్రీనివాస్‌తోపాటు 750 మంది అనుచరులు ఆరణి శ్రీనివాసులు సమక్షంలో జనసేనలో చేరారు. ఈసందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. భూమన కరుణాకరరెడ్డి, అభినయ్ రెడ్డి అరాచకాలు భరించలేక రోజూ వందల సంఖ్యలో ఎన్డీయేలో చేరుతున్నారన్నారు. ఈవారంలో వైసీపీ ఖాళీ కాబోతోందన్నారు. ఈకార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నేతలు మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, చినబాబు, బుల్లెట్ రమణ, సింగంశెట్టి సుబ్బరామయ్య, పాతకం వెంకటేష్, వెంకట్ రాయల్, వరప్రసాద్, సరితా నాగరాజు, ఆనంద్, గుత్తా నాగరాజ రాయల్ పాల్గొన్నారు. అనంతరం మొబైల్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం ఉమ్మడి జిల్లా బీసీ సంఘాల జేఏసీ యువజన అధ్యక్షుడు నెలవాయి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. నాయకులు ప్రసాద్, కుమార్, ప్రవీణ్ రాయల్, రామకృష్ణ, దినేష్, చైతన్య, శ్రీనివాస్, కిషోర్, వెంకటేష్ చిన్ని పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వైసీపీ నేత నైనార్ శ్రీనివాసులుతో ఆరణి శ్రీనివాసులు, వరప్రసాదరావు, సుగుణమ్మ

'సెబ్'కి సిబ్బంది కొరత

తిరుపతి(నేరవిభాగం), మే 2: జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) విభాగం సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. తిరుపతి అర్బన్, రూరల్, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చంద్రగిరి, నాగలాపురం, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడు, వెంకటగిరి ప్రాంతాల్లో సర్కిల్ కార్యాలయాలున్నా.. పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. జిల్లాలోకి అక్రమ మద్యం రాకుండా అరికట్టడం, సారా తయారీని నిరోధించడం, కల్తీ కల్లు విక్రయ కేంద్రాలపై తనిఖీ చేసి కేసులు నమోదు చేయడం తదితర బాధ్యతలు వీరు చూడాల్సి ఉంది. సర్కిల్ కార్యాలయాలకు కనీసం ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, మరో 15 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు అవసరం. కాగా ఒక్కో సర్కిల్‌లో ఒక సీఐ, ఒక ఎస్‌ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉండటంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

'యూటీఎస్' యాప్‌తో టిక్కెట్ కొనుగోలు సులభతరం

తిరుపతి(సెంట్రల్), మే 2: సాధారణ ప్రయాణికులు యూటీఎస్ మొబైల్ ద్వారా టిక్కెట్లు కొనుగోలుచేసే వారి సౌకర్యార్థం దూర పరిమితి ఆంక్షలు సడలించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ యాప్ ద్వారా సబర్బన్, నాన్‌సబర్బన్ స్టేషన్‌లకు 20-50 కి.మీ దూరం నుంచి టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండేదని, దానిని రద్దు చేశామన్నారు. ఇకపై రైల్వే ప్రాంగణం నుంచి 5 మీటర్ల దూరం నుంచి సాధారణ టిక్కెట్లు కొనుగోలు చేసేలా యాప్‌లో మార్పు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అన్ని స్మార్ట్ ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

ఎర్రచందనం డిపోల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

మంగళం, మే 2: తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ఎర్రచందనం ప్రైవేటు డిపోలను టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తిరుచానూరు-పూడి మార్గంలోని ధృవ ప్రోడక్ట్స్‌లో తమ బృందంతో కలిసి తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ఎర్రచందనం నిల్వలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. రిజిస్టర్ మేరకు నిల్వలు సరిగ్గా ఉన్నట్లు ధ్రువీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధృవ ప్రోడక్ట్స్‌లోని వివిధ రకాల రిజిస్టర్లు, ఎర్రచందనం రవాణాకు జారీ అయిన పర్మిట్లు, గోదాములో నిల్వలను సరిచూశామన్నారు. మిగిలిన డిపోలు కూడా రిజిస్టర్‌కు తగిన విధంగా స్టాక్ ఉండేలా సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ సెట్‌కు తొలి రోజు 85 శాతం హాజరు



ప్రశ్నపత్రం కోడ్ విడుదల చేస్తున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్ సెట్-2023-24 ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు వీసీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సెట్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఈ దఫా ఎస్వీయూకు అప్పగించింది. కన్వీనర్‌గా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాదుతోపాటు రాష్ట్రంలో ఎంపిక చేసిన 17 కేంద్రాల్లో ప్రారంభమైన ఈ పరీక్షలకు తొలి రోజు 85 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రం కోడ్‌ను ఎస్వీయూలో వీసీ విడుదల చేశారు. ఈనెల 20వ తేదీ నాటికి ఫలితాలు విడుదల చేసి, జూన్‌లో అడ్మిషన్లు చేపడతామని కన్వీనర్ తెలిపారు. రిజిస్ట్రార్ హుస్సేన్, వర్సిటీ డీన్ విజయభాస్కరరావు, ప్రొఫెసర్లు హేమ, కుసుమ హరనాథ్, కుమారస్వామి పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలను దీటుగా ఎదుర్కొంటాం

● టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2: తిరుపతిలో ఎన్నికల సందర్భంగా వైసీపీ కుట్రలను దీటుగా ఎదుర్కొంటామని టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిని ఎంతో అభివృద్ధి చేశామని చెబుతున్న వైసీపీ నాయకులు ఎంఆర్ పల్లె, బండ్లవీధిని ఒక్కసారి వర్షం వచ్చినప్పుడు చూడాలని కోరారు. కాలువలు పొంగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఊరవతల రోడ్లు టీడీఆర్ బాండ్ల కోసం వేసి ప్రజల అభివృద్ధి కోసం వేసినట్టు వైసీపీ నాయకులు చెబుతున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా తిరుపతిలో గెలిచేది కూటమి అభ్యర్థేనని స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుపతిలో అరాచకం చేసిన వైసీపీ నాయకులను ఎవ్వరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

● బీజేపీ నేత సామంచి శ్రీనివాస్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2: ప్రజల పాలిట శాపంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని బీజేపీ నేత సామంచి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూమి మీద ప్రజలకు అధికారం లేకుండా చేసే కుట్రకు వైసీపీ ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. వారసత్వంగా వచ్చిన భూమి మీద కూడా హక్కు లేకుండా పోయే ప్రమాదం ఈ చట్టం ద్వారా ఏర్పడిందన్నారు. మళ్లీ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వస్తే ప్రజల భూములకు భద్రత లేకుండా పోతుందని హెచ్చరించారు. అందువల్ల కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీయే విజయమే లక్ష్యంగా పనిచేయాలి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు



ప్రార్థనలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - వైసీపీ నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, (ఉపాధ్యాయనగర్), మే 2: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పనిచేయాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గురువారం ఓ ప్రముఖ హోటల్‌లో పాస్టర్లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరులకు ఎన్డీయే ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమై పోవడమే కాకుండా వైసీపీ నాయకుల అవినీతితో రాష్ట్రం 20 యేళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్రం అందిస్తున్న పథకాలకు జగన్ తన బొమ్మలను వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల మయంచేసి దివాలా తీయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ అధ్యక్షతన వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కూడా తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు, జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం నాయకులంతా ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ప్రచారాన్ని మరింత ఉధృతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే తిరుపతి నగరంలోని వినాయకనగర్, క్వార్టర్స్, సంత ప్రాంతాల్లో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే అది ఎన్డీయే, టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.


డాక్టర్ ఆశాలత

ఆ ఇద్దరూ ఏమయ్యారు?

ఐదేళ్ల కిందట తిరుపతి నగరంలో ఇద్దరు డాక్టర్లు నిరంతరం వార్తల్లో వ్యక్తులుగా ఉండేవారు. రాజకీయ ఉత్సాహంతో క్రియాశీలకంగా కనిపించేవారు. ఏమైందో ఏమో ఎన్నికల వేళ ఆ ఇద్దరి ఊసే తిరుపతిలో వినిపించడం లేదు. ఇద్దరిలో ఒకరు వైసీపీలో చేరాక ఉనికిని కోల్పోగా మరొకరు చేరడానికి వెళ్లి అనాదరణకు గురై మౌనంగా ఉండిపోయారు. సాయిసుధా హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి 2010 సమైక్యాంధ్ర ఉద్యమానికి సారథిగా రాష్ట్రవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. టీడీపీ ఆరోగ్య విభాగం అధ్యక్షురాలిగా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ ఏ పని అప్పగించినా ఖర్చుకు వెనుకాడకుండా ఘనంగా నిర్వహించేవారు. భర్త డాక్టర్ సుకుమార్‌కు తిరుపతి ఎంపీ టికెట్ ఆశించి నిరాశపడిన సుధారాణి, తన భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే నమ్మకంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరారు. అంతే ఆ తర్వాత ఆమె ఉనికి రాజకీయాల్లోంచి మాయమైంది. ఇప్పుడా పార్టీలో ఉన్నారో లేదో కూడా తెలియని స్థితి. తిరుపతిలో ప్రసిద్ధ గైనకాలజిస్ట్‌గా, టెస్ట్‌ట్యూబ్ బేబీ వైద్యనిపుణురాలుగా పేరు తెచ్చుకున్న డాక్టర్ రాయ ఆశాలత 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు సమక్షంలో తన భర్త వెంకటేశ్వర్లుతో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించి విఫలమవడంతో టీడీపీకి దూరమయ్యారు. అధికారంలోకి వచ్చిన వైసీపీలో అయినా తమ భవిష్యత్తును వెతుక్కుందామని ఆశపడ్డారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమన కరుణాకర్ రెడ్డిని అభినందించేందుకు పుష్పగుచ్ఛం తీసుకుని ఆయన ఇంటికివెళ్లారు. అక్కడ వీరికి నిరాదరణ ఎదురవడంతో నిశ్శబ్దంగా వెనక్కివచ్చేశారు. ఎన్నికల సమయంలో తమ ఇంటికి వచ్చి సాయం కోరిన భూమన కరుణాకరరెడ్డి గెలిచాక ఇలా వ్యవహరించడంతో ఈ దంపతులు రాజకీయాలకే దణ్ణం పెట్టి దూరంగా ఉండిపోయారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


డాక్టర్ సుధారాణి

ఇదీ మందు

మనోడ్ని నమ్మొచ్చా?



ఎన్నికల తేదీ దగ్గరయ్యే కొద్దీ అభ్యర్థుల ఒంట్లో జ్వరం పెరుగుతోంది. బింకం సడలుతోంది. ఇగో కాస్త పక్కన పెట్టి కాళ్ల బేరాలకీ దిగేస్తున్నారు. రేణిగుంట మండలంలో కొద్ది రోజులుగా వైసీపీలో ఈ వాతావరణం కనిపిస్తోంది. నాయకుడి ధోరణితో ఐదేళ్లుగా ఆ పార్టీ స్థానిక నాయకులే విసిగిపోయారు. నాయకుడి ప్రత్యేక అనుచరులు భూకబ్జాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు సాగాయి. బాధితులు స్థానిక నేతలను ఆశ్రయించేవారు. పార్టీకి చెడ్డపేరు వస్తుందని స్థానిక నేతలు నాయకుడి దగ్గర వాపోయేవారు. 'అదంతా నేను చేసుకుంటా.. మీరు జోక్యం చేసుకోవద్దు' అని ఆయన ఖరాకండీగా చెప్పేసేవారు. మరోదారి లేక అన్నీ దిగమింగుకుని మౌనంగా పార్టీలోనే ఉండిపోయినవారిలో కొందరు ఇప్పుడు పార్టీ మారడం మొదలుపెట్టారు. మరికొందరు అభ్యర్థి కోసం పనిచేయడానికి ముందుకు రావడంలేదు. పరిస్థితి గమనించిన నాయకుడు 'తప్పు చేశాను.. మరోసారి చేయను.. పార్టీ మారద్దు.. ఈ సారికి సహకరించండి' అంటూ స్వపక్ష నేతలనే బతిమలాడుకుంటున్నారు. బుజ్జగింపులతో దారిలోకి వచ్చి ఎన్నికల బాధ్యతలు స్వీకరించిన వారినీ ఆయన నమ్మడం లేదు. వారి కదలికలను నిరంతరం గమనించేందుకు షాడో పార్టీలను ఏర్పాటు చేశారనే ప్రచారం జరుగుతోంది. దీంతో నాయకుడి మాటలు నమ్మచ్చా లేదా తేల్చుకోలేక రేణిగుంట మండలంలోని వైసీపీ నేతల్లో గందరగోళం నెలకొందని అంటున్నారు.

- రేణిగుంట

నోటికాడ కూడు లాగేసిన జగన్....



జగన్ అధికార పగ్గాలు చేపట్టిననాటి నుంచి కక్షపూరిత నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారనడానికి ఈ చిత్రమే సాక్ష్యం. పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం స్థానిక పాత బస్టాండు సమీపంలో అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేసింది. నాడు నిత్యం అన్నదానసత్రంలా ఇది కళకళలాడింది. ఈ ప్రాంతంలో రెవెన్యూ, మండల, ఆర్‌అండ్‌బీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ఎందరో వివిధ పనులపై వచ్చేవారు. వారితో పాటు స్థానిక కూలీలు కూడా వచ్చి రూ. 5లకే కడుపునిండా భోజనం చేసేవారు. వందలాది మంది ఆకలి తీర్చిన ఈ అన్నక్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేశారు. ప్రస్తుతం ఈ భవనాన్ని బొగ్గులదిబ్బ ప్రాంత సచివాలయ కార్యాలయంగా మార్చేశారు. దీనిని చూసినప్పుడల్లా పేదల నోటి కాడ కూడు లాగేసుకున్న జగన్ సర్కారు తీరుపై పేదలు శాపనార్థాలు పెడుతుంటారు.

- గూడూరు

నాయకుల కాళ్లకు చెప్పులుండేవి కాదు



"ప్రజల కోసం పనిచేయాల్సిన నాయకులు మాట్లాడుతున్న భాష చూస్తే బాధేస్తోంది. ఒకప్పుడు ఓట్లకి డబ్బులు పంచుతారన్న మాటే

● మా రోజుల్లో...

వినబడేది కాదు. ఇప్పుడు వాళ్ళు ఎంత ఇస్తారు... వీళ్ళు ఎంతిస్తారు అనే మాటలే వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో రోజురోజుకీ పరిస్థితులు మారిపోతూనే ఉన్నాయి. పూర్వం కాళ్లకు చెప్పులు లేని నేతలు కూడా ఉండేవారు. ప్రచార ఖర్చులకు డబ్బులుండేవి కావు. నమస్కారంతో ఓటు అడిగేవారు. ఇప్పుడు ఓట్లడగడానికి కూడా ఊరేగింపు గా రావడం విచిత్రంగా ఉంది."

- రామచంద్రా రెడ్డి (82),
వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

- శ్రీకాళహస్తి



వేతనాల కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు: 2,492
సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలు: 1060
అద్దె భవనాల్లో ఉన్నవి: 1432
పనిచేస్తున్న కార్యకర్తల సంఖ్య: 2,468
లబ్ధి పొందుతున్నవారు: 1,36,390

నగరికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు ఇద్దరు పిల్లలు. అద్దె ఇల్లు. ఆమె భర్త ఆటో నడుపుతాడు. ఈ పరిస్థితుల్లో వీరి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ వర్తించడం లేదు. పిల్లల చదువుకు అమ్మఒడి పథకం కూడా అందడం లేదని ఆమె వాపోతోంది. జగన్ అధికారంలోకి వచ్చాక కక్ష కట్టి తమకు పథకాలు ఏవీ అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

గూడూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఈమె కొద్దిపాటి జీతమే ఇంటిల్లపాదికీ ఆధారం. ఈమెకు ఇద్దరు పిల్లలున్నారు. భర్తను కోల్పోయిన అత్త కూడా ఈమెతోనే ఉంటుంది. అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నందున వితంతు పింఛను కూడా రాదని చెప్పడంతో కుటుంబాన్ని నడపడానికి నానా యాతనా పడుతోంది.



నేను విన్నాను.. మరిచాను

● హామీలతో అంగన్‌వాడీలను ముంచేసిన జగన్ ● ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెరుగుదల
● టీడీపీ హయాంలో మెరుగైన వేతన పెంపు

జగన్ తీపి మాటలు విని నిలువునా మోసపోయామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక హామీల సంగతి పక్కన పెడితే పనిభారం మోపి, అప్పటి వరకు వర్తించిన సంక్షేమ పథకాలను తొలగించారంటూ నిప్పులు చెరుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదు. దీనికితోడు రకరకాల యాప్‌లు, సర్వేల పేరుతో పనిభారాన్ని మోపడంతోపాటు చాలీచాలనీ వేతనాలతో నాలుగున్నరేళ్లు అంగన్‌వాడీలకు నరకం చూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 42 రోజుల పాటు సమ్మె చేస్తే కనికరం లేకుండా ఉక్కుపాదంతో అణచివేశారు. మహిళలని చూడకుండా పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఎస్మా, ఉద్యోగాల తొలగింపు వంటి అస్త్రాలతో భయపెట్టి విధుల్లో చేరేలా చేశారని కార్యకర్తలు జగన్‌ను తూర్పారబెడుతున్నారు. ఇప్పటికీ సమ్మె కాలానికి పూర్తిగా సొమ్ము చెల్లించలేదని, మెనూ చార్జీలు పెంచకుండా వైసీపీ ప్రభుత్వం చేతిలో దగా పడ్డామని ఆవేదన చెందుతున్నారు.

అన్నొస్తాడు... మీకు మంచి చేస్తాడు..
తెలంగాణ ప్రభుత్వం కంటే రూ. వెయ్యి అదనంగా జీతం పెంచుతాను. మీ సమస్యలన్నీ తీరుస్తాను.
గత ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీలకు జగన్ చెప్పిన మాట ఇది.

టీడీపీ హయాంలోనే నయం

● 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్త వేతనాన్ని రూ.4,500 నుంచి రూ.10,500 వరకూ పెంచారు. ఆయాల వేతనాన్ని రూ.2,200 నుంచి రూ. 6 వేలకు పెంచారు. ఏకంగా 150 శాతం పెంచారు. జగన్ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచిందని సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

సమ్మె వేతనం మాటేమిటి

● గతేడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 వరకు అంగన్‌వాడీలు సమ్మె చేశారు. ప్రభుత్వ చర్చల్లో భాగంగా సమ్మె కాలానికి వేతనం ఇస్తామంటూ సీఎం జగన్ హామీ ఇచ్చారు. జీవో కూడా జారీ చేశారు. కానీ నేటికీ అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్పా ఆ ఊసే లేదు. ఐదేళ్లుగా కూరగాయలు, నిత్యావసరాలు, టీఏ, డీఏ బకాయిల గురించి పట్టించుకోవడం లేదు.

సమ్మెకు బహుమతి ఇది

సమ్మె సందర్భంగా 3,400 మంది అంగన్‌వాడీలకు పోలీసులు నోటీసులిచ్చారు. 2,040 మందిని గృహ నిర్బంధం చేశారు. 70 మందిపై బైండోవర్లు నమోదు చేశారు. 120 మందినఇ అరెస్టు చేశారు. సీఎం జగన్ తమకు ఇచ్చిన కానుక ఇదేనని అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

నాసిరకం ఫోన్లు... పనిచేయని యాప్‌లు

వైసీపీ పాలనలో పలు రకాల యాప్‌లు తీసుకువచ్చింది. అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు మాత్రం నాసిరకంగా ఉన్నాయి. యాప్‌లు, ఫోన్లు సరిగా పనిచేయక లబ్ధిదారుల వివరాలను నమోదు చేయలేక అంగన్‌వాడీలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలు నమోదు చేస్తే కానీ పోషకాహారం విడుదల రాదు. యాప్‌లు పని చేయక, ఫోన్లకు సిగ్నల్ రాక సకాలంలో పోషకాహారం అందించలేక నానా మాటలు పడుతున్నామని కార్యకర్తలు వాపోతున్నారు.

- తిరుపతి(వైద్యం)




అమానుషంగా ప్రవర్తించడం బాధాకరం

అంగన్‌వాడీల జీతాలను పెంచకపోవడం దారుణం. ఐదేళ్లలో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెంచడం అన్యాయం. చాలీచాలని జీతాలతో బతకలేక రోడ్డెక్కిన అంగన్‌వాడీలను పోలీసులతో ఈడ్చిపడేయటం, కేసులు నమోదు చేయడం దారుణం. అంగన్‌వాడీల విషయంలో జగన్ ప్రభుత్వ తీరు అమానుషం. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమేనా అక్కాచెల్లెమ్మలపై సీఎం జగన్‌కు ఉన్న గౌరవం.

- వాణిశ్రీ, అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నోట్ దిస్ పాయింట్


కరపత్రాల ప్రింటింగ్‌కు అనుమతి ఉండాల్సిందే



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలది కీలకపాత్ర. ఓటర్లను బలంగా ప్రభావితం చేసే ప్రచార సాధనమిది. అందుకే దీని ముద్రణ విషయంలో ఎన్నికల కమిషన్ చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127 ప్రకారం కేసులు నమోదు చేస్తారు. అవసరమైతే జైలుకు పంపుతారు. ఉదాహరణకు ప్రింట్ చేయాల్సిన ఫ్లెక్సీలు, కరపత్రాల నమూనాలను ప్రింటర్ తన పరిధిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ అభ్యర్థనపై ఇద్దరు సాక్షులు సంతకం చేయాల్సి వుంటుంది. ఆ అధికారి వాటిని నిశితంగా పరిశీలిస్తారు. అప్పుడు ప్రింట్ చేసేందుకు అనుమతితో కూడిన డిక్లరేషన్ ఇస్తారు. డిక్లరేషన్ పొందిన తరువాత మాత్రమే ప్రింట్ చేయాలని ఎన్నికల చట్టం స్పష్టం చేస్తోంది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రింటరే కాదు అభ్యర్థి కూడా ఆరు నెలలు జైలు శిక్ష,లేకుంటే రూ.2000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

- తిరుపతి(నేరవిభాగం)

వీడియోగ్రాఫర్ల ఓటు మిస్



ఈసారి ఓటేసే అవకాశం మిస్సవుతున్నామని జిల్లాలో 400 మందికి పైగా వీడియోగ్రాఫర్లు బాధపడుతున్నారు. ఎన్నికల సందర్భంగా రకరకాల వీడియోలు తీయడానికి నియోజకవర్గానికి సుమారు 60 మంది ప్రయివేట్ వీడియోగ్రాఫర్లను ఎన్నికల అధికారులు నియమించారు. సాధారణంగా ఎన్నికల విధుల్లో ఉండే జర్నలిస్టులకు ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం కల్పించింది. ఆ కోటాలో తాముకూడా ఓటు వేయవచ్చని భావించిన వీడియోగ్రాఫర్లకు భంగపాటు ఎదురైంది. పోస్టల్ బ్యాలెట్ గడువు ముగియడం, అధికారులు ఐడీ కార్డులు జారీ చేయకపోవడంతో ఓటు వినియోగించుకోలేక పోతున్నామని వీరంతా ఆవేదన చెందుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

బుజ్జగింపులకే పుణ్యకాలం సరి..

వైసీపీలో విభేదాల పంచాయితీలు కొలిక్కి రావడం లేదు. ఒక పక్క గడువు ముంచుకొస్తున్నా నగరి వైసీపీ అభ్యరి రోజా ఎన్నికల ప్రచారం మీద దృష్టిసారించలేక పోతున్నారు. పుణ్యకాలం కాస్తా పార్టీ అంతర్గత విభేదాల పరిష్కారానికే సరిపోతోంది. కుటుంబ సభ్యులకు ప్రచార బాధ్యతలను అప్పగించి ఆమె అసమ్మతి నాయకుల అనుచరులను మచ్చిక చేసుకునే పనిలో బిజీగా గడుపుతున్నారు. ఒక్కొక్కరికి ఒకటి పదిసార్లు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. వీలైనంత వరకు నగరిలోని తన ఇంటికి పిలిపించుకుని బుజ్జగించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. నింద్రకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని తనవైపు తిప్పుకునేందుకు ఏకంగా ఐదుసార్లు ఆమె ఇంటికి వెళ్లాల్సివచ్చింది. దీంతో ఆ మహిళా ప్రజాప్రతినిధి ఎట్టకేలకు మంత్రి రోజాను నగరిలో కలిసి మద్దతు ప్రకటించింది. ఒక్కొక్కరి ఇంటి చుట్టూ ఇన్నిన్ని సార్లు తిరగాల్సి రావడం మంత్రి క్యాంప్‌లోని వైసీపీ నాయకులకు తలనొప్పిగా మారిందనే మాటలు వినబడుతున్నాయి. దీంతో ప్రచార పర్వంలో మంత్రి రోజా వెనుకబడ్డారని నియోజకవర్గ ఓటర్లు గుసగుసలాడుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్



ఈ పోలింగ్ స్టేషన్లు స్పెషల్ ...




దివ్యాంగులు, మహిళలు,యువత కోసం ఎన్నికల కమిషన్ ఈసారి ప్రయోగాత్మకంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. మూడు కేటగిరీలుగా ప్రతి నియోజకవర్గంలో ఈ స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన చోట మహిళలకు 1, యువతకు 2, దివ్యాంగులకు 2 వంతున వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఈ స్టేషన్లను తొలిసారి వినియోగించనున్నారు. ప్రత్యేకించి ఈ బూత్‌ల వద్ద తాగునీరు, ర్యాంపులు, టాయిలెట్లు లాంటి ప్రాథమిక వసతులు కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న చోట ఓటు వినియోగించుకోవడంపై రిటర్నింగ్ ఆఫీసర్లు అవగాహన కల్పిస్తున్నారు. స్లిప్పు తీసుకుని లోపలకు వెళ్లి ఓటు ఎలా వేయాలో వివరిస్తున్నారు. అల్లర్లు, అలజడులకు భయపడి ఓటర్లు దూరం కాకుండా ఈ ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. మహిళా కేంద్రాల్లో మహిళా సిబ్బంది మాత్రమే ఎన్నికల విధుల్లో ఉంటారు. ఇతర కేంద్రాల తరహాలోనే ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు.



- తిరుపతి(కలెక్టరేట్)

● మీకు తెలుసా?

ఆ అధికారి మరీ అంత 'ఫ్యానా'..



హలో ...ఒక్కసారి ఆలోచించండి....మళ్లీ మన ప్రభుత్వమే వస్తోంది... మీరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి...అధికారంలోకి వచ్చిన వెంటనే మంచి పోస్టింగ్ ఇప్పించే బాధ్యత నాది..అంటూ తిరుపతి పోలీసు శాఖలో చక్రం తిప్పుతున్న ఓ కీలక అధికారి పోలీసులందరికీ ఫోన్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం(?) చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మీరే కాదు...మీ కుటుంబంలోని ప్రతి ఒక్కరూ మన ఫ్యాను గుర్తుకే ఓటేసేలా చూడండంటూ ప్రాధేయపడుతున్నారు. సదరు అధికారి మాటలు విని పోలీసులు ముక్కు మీద వేలేసుకుంటున్నారు. ఎంత బాస్ అయినా మరీ ఇంత ఓపెన్‌గా అడగడమేమిటంటూ పది రోజులుగా పోలీసు శాఖలో గుసగుసలాడుకుంటున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

ఇదీ మందు

కూలి పెంచాల్సిందేసప్పా!



'మరీ ఇంత తక్కువయితే లాబంలేదు సామీ. కూలీ పెంచకపోతే మేం వచ్చేది లేదు' అని తెగేసి చెప్తావుండారంట జనం. ఒగపక్క ముమ్మరంగా నామినేసన్లు ఏసేసినారు అబ్యర్తులు. మరోపక్క ప్రెచారాలకూ మల్లుకుని చానాకాలమే అయింది. నామినేసనప్పుడు ర్యాలీలు తీస్తే సరిపోతందా.. పోదుగదా. ఇప్పుడు ప్రెచారాలు గెట్టిగా చెయ్యాల. ఆమాదిరిగా చెయ్యాలంటే కనాకస్టం యాభై మంది జనం గావాల. వోల్లతోపాటు ఈదిలో జనమంతా మనపక్కే ఉండారని ఊదరగొట్టాల. అధికార పార్టీ ఈ ఐదేల్లు చేసిన దాడులు, దౌర్జన్యాలకు కడుపు మండిన జనం, ఎవురు పిల్సినా పిలవకపొయ్యినా ప్రతిపక్ష పార్టీ ప్రెచరాల్లో, ర్యాలీల్లో వొచ్చి కలిసిపోతా వుండారు. కానీ ఇప్పుడొచ్చిండే చిక్కంతా అధికార పార్టీకే. 'పథకాలిచ్చినాము గదా, ప్రెచారానికి వొచ్చెయ్యండంటే, జనం ఒగ పట్టాన కదలడంల్యా. రాకపోతే ఆ పథకాలు క్యాన్సిలు జేసేస్తామని బెదిరించడానికి ఇపుడు వాల్ల ప్రెబుత్వమూ అధికారంలో ల్యాకుండా పాయె. బలవంతంగా రాజీనామాలు చెయ్యించిన వాలంటీర్లు గూడా మనకెందుకొచ్చిన గొడవని గమ్మునుండి పొయిరి. జనంజూస్తే కొండెక్కి కూకోనుండారు. వాల్లకు నిన్నమొన్నటిదాకా ర్యాలీలకు, ప్రెచారాలకు ఎల్లొస్తే రొండొందలనింకా నాలుగొందలదాకా మాత్రమే కూలీ దక్కతా వుండాది. వాటర్ బాటిలు, బిర్యానీ ప్యాకెట్టు గూడా ఇస్తావుండారు. మొగోల్లకయితే క్వార్టరు చీపు లిక్కరు అదనం. కానీ అధికార పార్టీ ప్రెచారానికి జనం పెద్దగా మొగ్గు చూపడంలేదంట. మొన్నీమజ్జ ఆ పార్టీ ర్యాలీకని తీసుకోనెల్లిన నాయకులు కక్కుర్తిపడి.. ఎదురుగుండా లేరనిజెప్పి, కొంతమంది ఆడోల్లకి కాసులు ఎగ్గొట్టడానికి జూసిన పాపం ఇప్పుడు కొడతా వుండాదంట. 'ప్రెచారాలకు ఎల్లొచ్చినాక మీరు కాసులు దర్మంగా ఇస్తారని గ్యారంటీ ఏంది?' అని ఆడోల్లు ఎదురు తిరగతా ఉండారంట. అంతేకాదు.. 'ఎండలు మండిపోతా వుండాయి. ఈ ఎర్రటి ఎండల్లో ర్యాలీలకు, ప్రెచారాలకు వొచ్చి వడదెబ్బ తగిలి మేం ఆస్పత్రిపాలైతే మీరు జూస్తారా?' అని గూడా కొసిన్ని ఏస్తా వుండారంట. కూలీ డబ్బులు ఆరేడువొందలు జేస్తేనే, అదిగూడా ముందుగా మా చేతుల్లో పెడితేనే ప్రెచారాలకు కదిలొస్తామని తెగేసి జెప్తావుండారంట జనం. డబ్బులు పంచే చోటా నాయకులమీద అస్సలు నమ్మకంలేని జనంలో కొంతమందైతే.. ముందుగా నూరో, ఇన్నూరో అడ్వాన్సు కొట్టి మల్ల మాట్లాడు' అనేస్తావుండారంట. వాల్ల డిమాండ్లను తీర్చడంతప్ప, అధికార పార్టీకి ఏరే మార్గం కనిపించడంలేదు. ప్రెతిపచ్చ పార్టీకి గూడా జనం తీరుజూసి 'ఈ పద్దినాలు ఈ ఎట్టరా ఈల్లతో ఏగాల బగమంతుడా' అనేసి గుబులు పుడతా వుండాదంటే నమ్మండి.

- కుప్పం

● గుర్తుంచుకోండి

రాజకీయ అల్లరీ నేరమే

ఏదైనా రాజకీయ పార్టీ ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు, అక్కడ నిర్వహించే సమావేశాలను ఆ పార్టీకి సంబంధం లేని వ్యక్తి అడ్డుకోవడం, భంగపరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. ప్రచార సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తి గురించి వివరాలు రాబట్టుకోవచ్చు. ఇక, పోలీసులకు కూడా ఆ వ్యక్తి తన వివరాలను చెప్పకపోతే, వారెంట్ లేకుండా అతడిని నిర్బంధంలోకి తీసుకోవచ్చు.

- చిత్తూరు


● మీకు తెలుసా ?

గోడలపై రాతలు మాయం



గతంలో ఎన్నికలు వచ్చాయంటే చాలు.. గోడలన్నీ ఆయా పార్టీల అధినేతలు, అభ్యర్థుల బొమ్మలు, గుర్తులు, రాతలతో నిండిపోయేవి. ఎటు చూసినా తమ పార్టీకే ఓటు వేయాలనే ప్రచార ప్రకటనలు కనిపించేవి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునే వారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం. వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేసేవారు. అప్పట్లో గోడలపై రాసే, బొమ్మలేసే ఆర్టిస్టులకు డిమాండు ఎక్కువగా ఉండేది. ఎన్నికలు ముగిశాక ఇళ్ల యజమానులు రంగులేసుకునే వారు. క్రమేణా ఎన్నికల నిబంధల కారణంగా గోడమీద రాతలు కనుమరుగయ్యాయి. ఇప్పుడా స్థానంలో ఫ్లెక్సీలు చేరిపోయాయి.

- చిత్తూరు కలెక్టరేట్



← నాడు.. నేడు బీమా పథకం అమలిలా →

బీమా.. ఏదీ ధీమా?

● వైసీపీ ప్రభుత్వంలో ఏళ్లు గడిచినా బాధితులకు అందని పరిహారం
● టీడీపీ హయాంలో కుటుంబమంతటికీ వర్తింపు ● ఇప్పుడేమో కుటుంబ పెద్దకే

జిల్లాలో 2022-23లో వివిధ ప్రమాదాల్లో 111 మంది, సహజంగా 868 మంది వంతున మొత్తం 979 మంది మరణించారు. వీరిలో 107 మందికే పరిహారం అందింది. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసి ఏడాది దాటినా ఇంకా 872 మందికి వైఎస్ఆర్ బీమా అందలేదు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో 743 మంది మరణిస్తే 88 మందికి పరిహారాన్ని అందించారు. ఇంకా 655 మందికి బీమా రాలేదు.

- కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు కాసింత ఆర్థికదన్నుగా నిలిచే వైఎస్ఆర్ బీమా పథకం విషయంలో జగన్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ గణాంకాలే నిదర్శనం. అయినా.. తాము బీమాతో అండగా నిలుస్తున్నామంటూ కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడం ఈ ప్రభుత్వానికే చెల్లింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

నా పేదలు, నా పేదలు.. అని పదేపదే సభల్లో సీఎం జగన్ చెబుతుంటారు. వాళ్లకు ఏమైనా ప్రయోజనం కలిగి ఉంటే అది తనవల్లేనని గొప్పగా అంటారు. కానీ, అలాంటి పేదలకు అండగా నిలిచే విషయంలో మాత్రం చిత్తశుద్ధి కనిపించదు. అలాంటి వాటిలో వైఎస్ఆర్ బీమా పథకం ఒకటి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబ సభ్యులకు వెంటనే చంద్రన్న బీమా గుర్తుకు వచ్చేది. మండలాల్లోని వెలుగు కార్యాలయాలను ఆశ్రయించేవారు. అంత్యక్రియల కోసం ఆ బాధితులకు రూ.5 వేలు తక్షణ సాయం అందేది. సహజ మరణమైతే రూ.2 లక్షలు, ప్రమాద మరణమైతే రూ.5 లక్షల ఆర్థిక సాయం నెలలోపు ఆ కుటుంబ సభ్యులకు అందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకం పేరును వైఎస్సార్ బీమాగా మార్చారు. అమలు చేయడంలో విఫలమైంది. ఇప్పుడు మట్టి ఖర్చులకు తక్షణ సాయం అందడం లేదు. ఏళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు బీమా పరిహారం దక్కడం లేదు. వైసీపీ ప్రభుత్వం అనేక రకాల నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించింది.

టీడీపీ హయాంలో పకడ్బందీగా...

ఈ పథకం అమలు కోసం టీడీపీ ప్రభుత్వంలో మండలానికో బీమా మిత్ర పనిచేసేవారు. ఎప్పటికప్పుడు బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నెల రోజుల్లో పరిహారం అందేలా కృషి చేసేవారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం ఈ బాధ్యతను వలంటీర్లకు అప్పగించింది. వలంటీర్లు వివరాలు సేకరించి సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రాసెస్ చేస్తున్నారు. చివరగా జిల్లా కేంద్రంలోని పీడీ కార్యాలయంలో ఫైనల్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఇంత చేసినా పరిహారం సమయానికి అందడం లేదని వాపోతున్నారు. బీమా సొమ్మును అందించే ఇన్సూరెన్సు కంపెనీలకు ప్రభుత్వం సక్రమంగా ప్రీమియం కట్టడం లేదని, అందుకే ఆయా కంపెనీలు బాధిత కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించడం లేదని తెలుస్తోంది.

పాలకులూ.. వీటికేమంటారు?

మూడేళ్లుగా నిరీక్షణే..



గుడిపాలకు చెందిన ఈమె పేరు మమత. భర్త భూపతినాయుడు. ప్రైవేటు బస్సు కండక్టరుగా పనిచేసేవారు. 2021 మార్చి 7న గుడిపాల మండలంలోని వసంతాపురం వద్ద బైకులో ప్రయాణిస్తుండగా కారు ఢీకొంది. 16 రోజులు వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 17వ రోజు మరణించారు. ఆయన మరణించిన 15 రోజుల తర్వాత రూ.10 వేలను అందించారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రమాదవశాత్తు మరణించడంతో రూ.5 లక్షలు పరిహారం రావాలి. మట్టి ఖర్చులకు ఇచ్చిన రూ.10 వేలు పోను మిగిలిన రూ.4.90 లక్షల కోసం బాధితురాలు మూడేళ్లకుపైగా వేచి చూస్తున్నారు. కుటుంబ పోషకుడి మృతితో వీరి కుటుంబం ఆర్థికంగా ఛిన్నాభిన్నమైంది. రోజువారి కూలి పనులకు వెళ్లే ఈమెకు ఆ డబ్బు వస్తే సపోర్టుగా ఉంటుంది.

మృతిచెంది మూడేళ్లయినా..



శాంతిపురం మండలం పొన్నేపల్లె గ్రామానికి చెందిన ఈయన పేరు చెంగ్రాయప్ప. 2021 జనవరి 21న శాంతిపురం సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. పీఈఎస్ ఆస్పత్రిలో వారం రోజులు చికిత్స పొంది జనవరి 28న మృతిచెందారు. మట్టి ఖర్చులకు అధికారులు రూ.10 వేలు అందించారు. మూడేళ్లు పూర్తయినా కుటుంబ సభ్యులకు మిగిలిన రూ.4.90 లక్షల బీమా సొమ్ము రాలేదు.

నాలుగేళ్లయినా అందని బీమా



శాంతిపురం మండలం పొన్నేపల్లె గ్రామానికి చెందిన ఈమె పేరు శాంతకుమారి. కుమారుడు కార్తీక్ బీటెక్ చదివి బెంగళూరులో ఉద్యోగం చేసేవారు. కిడ్నీలో రాళ్లున్నాయంటే కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రెండు రోజులకు పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ 2020 మార్చి ఒకటో తేదీన మృతి చెందారు. చేతికొచ్చిన కుమారుడు మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. అప్పట్లో రూ.5 వేలను అధికారులు అందించారు. మిగిలిన రూ.95 వేలను వెంటనే ఇస్తామని చెప్పారు. నాలుగేళ్లయినా ఇంకా రాలేదు.

కేక్, టీలతో సరిపెట్టారు!

● రెండో విడత శిక్షణలో ఇబ్బంది పడ్డ పోలింగ్ సిబ్బంది

వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళశాలలో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పీవోలు, ఏపీవోలకు రెండో విడత శిక్షణ ఏఆర్వో ఆధ్వర్యంలో గురువారం జరిగింది. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అధికారులు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు. ఉదయం 11.30 గంటలకు టీ, కేక్‌లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో భోజనం ఏర్పాటు చేశారు. ఆలస్యమవడంతో ఐదుగురు స్పృహ కోల్పోయారు. దీంతో వారిని సమీపంలోని వైద్య శిబిరానికి తరలించాల్సిన పరిస్థితి. మీటింగ్‌కు వెయ్యిమంది హాజరు కాగా అధికారులు కేవలం రెండు టెంట్లే ఏర్పాటు చేయడంతో ఎండలో కొందరు, వరండాల్లో కొందరు కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-వెంకటగిరి టౌన్

బీసీవై పార్టీ అధ్యక్షుడి అరెస్టుకుయత్నం

బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌పై సదుం పోలీసులు నమోదు చేసిన రెండు కేసుల్లో ఎలాంటి చర్యలూ తీసుకోరాదని హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.హెచ్.నాయుడు గురువారం ఉత్తర్వులిచ్చారు. గతనెల 29వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామమైన సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు వెళ్లడంతో వైసీపీ అల్లరి మూకలు వాహనాలు ధ్వంసం చేసి, పలువురిని గాయపరిచిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనలో సదుం పోలీసులు రామచంద్రయాదవ్‌తోపాటు మరికొందరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీనిపై రామచంద్రయాదవ్ హైకోర్టుకు వెళ్లగా బెయిల్ మంజూరు చేయడంతో ఆయన పుంగనూరులో ఇంటికి చేరుకున్నారు.అయితే రామచంద్రయాదవ్‌ను అరెస్టు చేయాలని పుంగనూరులోని ఆయన ఇంటి వద్దకు సీఐ రాఘవరెడ్డి పోలీసులతో వెళ్లారు. ఇంట్లో ఉన్న ఆయన తనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని రెండు ఆర్డర్ కాపీలను సీఐకి పంపారు. అనుమతి లేకుండా ఎర్రాతివారిపల్లెకు వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎంపీడీవో జి.రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సదుం పోలీసుస్టేషన్‌లో రామచంద్రయాదవ్‌పై సెక్షన్ 341, 188 ఐపీసీ ప్రకారం మరో కేసు ఉందని సీఐ చెప్పారు.అయితే అది బెయిలబుల్ కేసని, అరెస్టుకు అవకాశం లేదని యాదవ్ మనుషులు పోలీసులకు తెలిపారు. ఈలోపు పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకోవడం, ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు వెనుదిరిగారు.

-పుంగనూరు

గెలుపే లక్ష్యంగా..!

జీడీ నెల్లూరు వర్తమానం

జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఈసారి గెలుపే లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతోంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో వేపంజేరి కనుమరుగై.. జీడీనెల్లూరు, పూతలపట్టు ఏర్పాటయ్యాయి. జీడీనెల్లూరుకు మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో 2009లో కాంగ్రెస్, 2014, 2019లో వైసీపీ గెలిచింది. తొలిసారిగా జయకేతనం ఎగురవేయాలన్న కృతనిశ్చయంతో టీడీపీ అభ్యర్థి థామస్, నేతలు, శ్రేణులు గట్టిగా పనిచేస్తున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుటుంబం మీద ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ నుంచి ఆయన మేనల్లుడు రమేష్ బాబు పోటీ చేస్తుండడం వంటి కారణాలతో వైసీపీ క్యాంపు డీలా పడింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/వెదురుకుప్పం

● పనిచేసుకుపోతున్న టీడీపీ శ్రేణులు

తీవ్రస్థాయిలో వ్యతిరేకత కూడగట్టుకున్న నారాయణస్వామి

వైసీపీపై కాంగ్రెస్ అభ్యర్థి ప్రభావం

థామస్‌కు అనేక అనుకూలతలు..




ఈసారి జీడీనెల్లూరులో జెండా ఎగురవేయాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ అధినేత డాక్టర్ థామస్‌ను రంగంలోకి దింపింది. జూన్ 1న ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినప్పటి నుంచీ ఆయన అందర్నీ కలుపుకొని ముందుకు వెళుతున్నారు. ఎన్నికలు దగ్గరపడిన తర్వాత పూర్తి సమయాన్ని ఆయన నియోజకవర్గానికే కేటాయించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి, కుమారుడు, తమ్ముడు.. ఇలా కుటుంబ సభ్యులంతా నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. ఆ మధ్య నియోజకవర్గంలో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు థామస్ గొప్పతనం గురించి వివరించారు. దాంతో ప్రజలందరికీ థామస్ గురించి మరింత తెలిసింది. ఇన్‌ఛార్జిగా నియమించిన కొత్తలో కొంతకాలం తడబాటుకు గురైనా ఆ తర్వాత నియోజకవర్గంలోని సీనియర్ల సహకారంతో పుంజుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు పండుగలకు బహుమతులు పంపిణీ చేయడం, కార్యకర్తల ఇళ్లల్లో జరిగే ప్రతి కార్యక్రమాలకు హాజరవ్వడం, గ్రామాల్లో తాగునీటి ప్లాంట్లు వంటి అవసరాలను తీర్చడంతో ప్రజలకు దగ్గరయ్యారు.

నారాయణస్వామిపై వ్యతిరేకత



తన వయసునూ పక్కనపెట్టి డిప్యూటీ సీఎం నారాయణస్వామి అవకాశమున్నప్పుడల్లా సీఎం జగన్ కాళ్ల మీద పడడం.. జగన్ కోసం తన చర్మం వలిచి చెప్పులు కుట్టించుకుంటాననడం.. వంటి చర్యలతో తమ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టారనే ఆగ్రహం దళితుల్లో ఉంది. అలాగే, మాటిమాటికీ నియోజకవర్గంలోని రెడ్ల మీద విమర్శలు చేయడంతో.. ఆయనపై వీరూ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఉంది. ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్నా, సతీమణిని కార్వేటినగరం జడ్పీటీసీగా అక్రమ ఏకగ్రీవం చేసుకోవడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ప్రతి మండలంలోనూ కొండల్ని, గుట్టల్ని ఆయన ఆయన అనుచరులు చదును చేసుకుని ఆక్రమించుకున్నారు. మామిడి మొక్కలు నాటి సాగు చేపట్టారు. నియోజకవర్గంలో ఏ కొండ చూసినా గుండు కొట్టేశారు. నారాయణస్వామికి టికెట్ రాకుండా స్థానిక రెడ్డి సామాజికవర్గ నాయకులు బలంగా ప్రయత్నించి తొలుత విజయం సాధించారు. ఆ తర్వాత నారాయణస్వామి సీఎం జగన్ వద్దకెళ్లి బతిమలాడుకుని టికెట్ తెచ్చుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. చివరగా తన కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ తెచ్చుకున్నారు. ఈ వ్యతిరేకత ఆయన కుమార్తెకు ఇబ్బందికరంగా మారనుంది.

కాంగ్రెస్ అభ్యర్థితోనూ తీవ్ర నష్టం



నారాయణస్వామి గెలుపు కోసం దశాబ్దాలుగా కృషి చేసిన ఇద్దరు మేనల్లుళ్లలో ఒకరైన రమేష్‌బాబు ఆయనతో విబేధించి కాంగ్రెస్‌లో చేరారు. కృపాలక్ష్మిని ఓడిస్తానంటూ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇటీవల కార్వేటినగరంలో ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన ప్రచారానికి ఆదరణ లభించింది. దీంతో వైసీపీ ఓట్లను ఆయన పెద్దఎత్తున చీల్చగలరని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నరసింహులుకు 1967, 2279 ఓట్లు పోలయ్యాయి. ఈసారి రమేష్ బాబు అభ్యర్థి కావడంతో ఆ ఓట్లు బాగా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

బలిజ ఆత్మీయ సభను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న పల్లమాల సుధాకర్

శ్రీకాళహస్తి, మే 2: పట్టణంలోని మహేష్ కల్యాణ్ సదన్‌లో ఈ నెల 5వ తేదిన జరగనున్న బలిజ ఆత్మీయ సభను జయప్రదం చేయాలని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పల్లమాల సుధాకర్ నియోజకవర్గ బలిజ సామాజికవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాళహస్తిలోని ఆయన నివాసంలో ఆత్మీయ సమావేశం నిర్వహణపై బలిజ ప్రముఖులతో చర్చించారు. అనంతరం ఆయన మీడియా మాట్లాడుతూ... ఆత్మీయ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ హాజరు అవుతారని తెలపారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై చర్చ, జనాభా దామాషా ప్రకారం బలిజలకు దక్కాల్సిన పదవులు, విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకునేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి విశేష సేవలు అందించారని, ఆయన కుమారుడు సుధీర్ రెడ్డిని గెలిపించి నియోజకర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్ధులుగారి ప్రసాదు, పల్లమాల శశాంక్, కంట రమేష్, కాసరం రమేష్, పసుపులేటి నవీన్ కుమార్, కొట్టేసాయి, డీజే ప్రసాద్, రామిశెట్టి కిరణ్ కుమార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: భానుప్రకాష్


టీడీపీలో చేరిన వారితో భానుప్రకాష్

వడమాలపేట, మే 2: అక్రమాలకు పాల్పడుతూ ప్రజలకు భారంగా మారిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎన్‌డీఏ కూటమి నగరి అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం వడమాలపేట మండలం పత్తిపుత్తూరు ఆదిఆంధ్రవాడలో ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు భానుప్రకాష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సర్పంచుల ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గోపి, లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్, శేషాద్రి, రాజేష్, నాగేంద్ర, జగదీష్, మురగయ్య, గురుస్వామి, కిరణ్, చెంచురామయ్య, కాటయ్య, పవన్, ధనంజయులు నాయుడు, మునిరత్నం, మునిరెడ్డి, రవినాయుడు, సురేష్‌బాబు, గజేంద్రయ్య, లంబోధరం, మురళీకృష్ణ, లోకనాధం, దేవ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మాత్రలు వేసుకుని మహిళ మృతి

ఏర్పేడు, మే 2: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ గుర్తు తెలియని మాత్రలు తిని మృతి చెందింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.... ఏర్పడు మండలం చెల్లూరు అరుంధతివాడకు చెందిన కాటమ్మ(45) గత కొద్దిరోజులుగా నరాల బలహీనత, శరీర నొప్పులతో బాధడుతోంది. ఏప్రిల్ 24న ఆమెకు శరీర నొప్పులు ఎక్కువవడంతో ఇంట్లో ఉన్న ఏవో మాత్రలు మింగింది. అపస్మారకస్థితికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంటలో పడి ఆరేళ్ల బాలుడి మృతి

మంగళం, మే 2: తిరుపతి శివార్లలోని తిరుమలనగర్ పంచాయతీకి చెందిన టీడీపీ నేత గంటా కృష్ణ కుమారుడు పవన్ శంకర్(6) బుధవారం మృతి చెందాడు. సెలవులు కావడంతో ఏర్పేడు పాపానాయుడుపేటలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఆడుకుంటున్న సమయంలో నీటిగుంటలో పడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం పవన్ మృతదేహాన్ని తిరుమలనగర్‌లోని నివాసానికి తరలించారు.


పవన్ శంకర్ (ఫైల్ ఫొటో)

టీడీపీతో సర్వజన సంక్షేమం

బొజ్జల సుధీర్‌రెడ్డి


సమావేశంలో బొజ్జల సుధీర్ రెడ్డి తదితరులు

తొట్టంబేడు, మే 2: సర్వజనుల సంక్షేమం కోసం టీడీపీని గెలిపించాలని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని కలవగుంట, కాలంపల్లి, రేపల్లె, గొల్లపల్లి, వేలంపాడు, రాజుగుంట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డికి అవినీతి అక్రమాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పరిశ్రమల్లో స్థానిక యువతకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, రంగినేని చంచయ్యనాయుడు, తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, తాటిపర్తి రవీంద్ర నాథ్‌రెడ్డి, బొల్లినేని జగన్నాథంనాయుడు, పాపిరెడ్డి, మనోహర్ రెడ్డి, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని వేడాం పంచాయతీ అబ్బాబట్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తెయ్యగౌడ్ తన అనుచరులతో కలిసి గురువారం టీడీపీలో చేరారు. వారందరికీ బొజ్జల సుధీర్‌రెడ్డి పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకాళహస్తి మండలం రామాపురం పంచాయతీలో మాజీ సర్పంచు కూనాటి మల్లిఖార్జున యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో గోపాలన్న వేసిన రోడ్లు, డ్రైనేజ్‌లు తప్ప వైసీపీ పాలనలో అరాచాకాలు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో కూనాటి శివా యాదవ్, కూనాటి కవిత, సుబ్రహ్మణ్యం, శివకుమార్, గంధం ప్రసాద్, కూనాటి భాస్కర్, రత్నమ్మ, సుబ్బయ్య, రమణయ్య, ఆది పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో బొజ్జల రిషితారెడ్డి

సూపర్ సిక్స్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి

తారకరామనగర్: ఎన్డీయే ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్ సిక్స్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పేర్కొన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలకు అన్నివర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జినాయుడు ఆధ్వర్యంలో బాలకృష్ణ, మణికంఠ, చిరంజీవి తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. అలాగే వలంటీరు ద్రాక్షాయణి రాజీనామా చేసి టీడీపీలో చేరారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, మే 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. అత్యంత శుభగ్రహమైన గురువు మేషరాశి నుంచి వృషభ రాశికి మారే సందర్భంగా గురు సంక్రమణ పూజలు చేశారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కలశ స్థాపనతో అంకురార్పణ చేసిన విషయం తెలిసిందే. గురువారం దక్షిణామూర్తి స్వామి మూలమూర్తి, కలశాలకు పూజా కైంకర్యాలను నిర్వహించారు. అభిషేకాలు చేశారు.

ఎన్డీఏ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు


ప్రార్థనలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్), మే 2: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పనిచేయాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గురువారం ఓ ప్రముఖ హోటల్‌లో పాస్టర్లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరులకు ఎన్డీఏ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోవడమే కాకుండా వైసీపీ నాయకుల అవినీతితో రాష్ట్రం 20 యేళ్లు వెనక్కు వెళ్లి పోయిందన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్రం అందిస్తున్న పథకాలకు జగన్ తన బొమ్మలను వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల మయంచేసి దివాలా తీయించారన్నారు. అనంతరం టీడీపీ నాయకురాలు ఎం.సుగుణమ్మ అధ్యక్షతన వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న పలువురు నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కూడా తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు, జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం నాయకులంతా ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ప్రచారాన్ని మరింత ఉధృతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే తిరుపతి నగరంలోని వినాయకనగర్, క్వార్టర్స్, సంత ప్రాంతాల్లో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు సతీమణి కొల్లూరి లక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే అది ఎన్డీఏ, టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.


వైసీపీ నాయకులకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుగుణమ్మ, వరప్రసాదరావు తదితరులు

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మే 2: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న చక్రేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని జట్టిపాలెంలో వెలసిన స్వామి ఆలయంలో గురు సంక్రమణం విశిష్టతను పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు పరమేశ్వరయ్య పాల్గొన్నారు.



వైసీపీ నుంచి జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి సస్పెన్షన్



పుత్తూరు అర్బన్, మే 2: వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డిపై వైసీపీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసింది. బుధవారం అర్ధరాత్రి వైసీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కేఆర్‌జే భరత్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి రోజా ఫిర్యాదు మేరకు మురళీధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గత రెండు ఎన్నికల్లో రోజా గెలుపునకు మురళీధర్‌రెడ్డి విశేష కృషి చేశారు. 2019 ఎన్నికల తరువాత జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డికి, మంత్రి రోజాకు మధ్య విభేదాలు పొడచూపాయి. రోజా కుటుంబసభ్యులు మండలంపై ఆధిపత్యం ప్రదర్శిస్తుండడంతో పాటు మురళీధర్‌రెడ్డి వర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోయారు. జడ్పీటీసీ సభ్యుడిగా మండల అభివృద్ధికి నిధులు కేటాయించుకునే క్రమంలో మంత్రి రోజా అడ్డుతగులుతున్నారని మూడు మాసాల క్రితం చిత్తూరు జడ్పీ సమావేశంతో పాటు మీడియా సమావేశం నిర్వహించి మరీ ధ్వజమెత్తారు. నామినేషన్ల ముందు వరకు మంత్రి రోజాకు నగరి సీటును ఇవ్వవద్దని వైసీపీ అధిష్ఠానం వద్ద మొరపెట్టుకున్నారు. మంత్రి రోజాపై పలు సందర్భాల్లో అసమ్మతిని ప్రదర్శిస్తూ వచ్చారు. అధిష్ఠానం తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయంతో వడమాలపేట వైసీపీలో అలజడి చెలరేగింది. ఎన్నికల ముందు మురళీధర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు మండలంలో వైసీపీ ఓటుబ్యాంక్‌పై తీవ్ర ప్రభావం చూపనుందనే మాటలు వినబడుతున్నాయి. దీనిపై వివరణ కోరేందుకు మురళీధర్‌రెడ్డిని సంప్రదించగా స్పందించేందుకు ఆయన నిరాకరించారు.

ఆరుగురు వలంటీర్ల రాజీనామా

ఏర్పేడు, మే 2: ఏర్పేడులో ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. గురువారం ఎంపీడీవో గిడ్డయ్యను కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. కర్ణ, బొడుగు కల్యాణ్, అక్కుపల్లి తేజ, బొడుగు స్వాతి, పి.కుసుమకుమారి, ఎం.అనిత రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

అధిష్ఠానం ఆదేశం శిరోధార్యం: హేమలత


టీడీపీ నాయకులతో హేమలత

సత్యవేడు, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా విబేధాలు వీడి పార్టీ గెలుపు కోసం కలసికట్టుగా పయనిస్తామని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత తెలిపారు. బుధవారం రాత్రి వరదయ్యపాళెం మండలం వెంకటరెడ్డికండ్రిగలో టీడీపీ నాయకుడు పరుచూరి మల్లికార్జున్‌నాయుడు నివాసంలో టీడీపీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హేమలత, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం హాజరయ్యారు. టీడీపీ అభ్యర్థిత్వాన్ని హేమలత ఆశించిన విషయం తెలిసిందే. ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌ను అభ్యర్థిగా బరిలో దింపాలని చివరి వరకు ప్రయత్నించారు. రాజకీయ సమీకరణాలతో ఆదిమూలానికి టికెట్ కేటాయించారు. దీంతో హేమలత గత కొద్ది కాలం నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు హేమలతతో చర్చించడంతో ఆమెతో కినుక వీడి ఆదిమూలం గెలుపునకు కృషి చేసేందుకు నిర్ణయించుకున్నారు. నరసింహయాదవ్, మాధవులనాయుడు ఆధ్వర్యంలో హేమలత, ఆదిమూలంను కలిసి తన పూర్తి మద్దతు తెలిపారు. పార్టీ గెలుపుకు కృషి చేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు.

కూటమి గెలుపు తథ్యం

పిచ్చాటూరు, మే 2: కేంద్రంతో పాటు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి గెలుపు తథ్యమని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులనాయుడు పేర్కొన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా మేనిఫెస్టోలో రూపొందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పిచ్చాటూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్దురాజు, నాయకులు ఎం.ఎస్. రవి, దొరవేలు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

